



22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్తా పత్రిక


మంగళవారం 25-08-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 136 రూ॥ 6.00





# విశ్వ విద్యాలయమా! వినోద కేంద్రమా!!




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘువేందర్ రావ్
9063524136, 9908658888


- సినిమా ఈవెంట్లు నిర్వహించే వ్యాపార స్థలమా!
- యూనివర్శిటీ లో సినిమా ఈవెంట్ కు అనుమతి ఎలా ఇచ్చారు?
- పోలీస్ బందోబస్త్ ఎలా సమకూర్చారు!
- ప్రమాదం జరిగినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?
- విద్యార్థుల కు గాయలైనా పోలీస్ శాఖ ఏం చేస్తోంది?
- సినిమా కు ఎ సర్టిఫికెట్ ఎందుకిస్తారో మల్లారెడ్డి కి అవగాహన ఉందా?
- మల్లారెడ్డి కాలేజీలు మూసుకొని ఈవెంట్లు చేసుకో.?
- విద్యార్థి సంఘాలు ఎక్కడున్నాయి?
- మానవ హక్కుల సంఘాలు ఏం చేస్తున్నాయి?
- విద్యా శాఖ ఏం చేస్తున్నట్లు?
- ఈవెంట్ల పేరుతో విద్యార్థుల ప్రాణాలు పోయినా పర్వాలేదు అనుకుంటున్నారా?
- హ్యూమన్ రైట్స్ కమిషన్ దాకా ఈ సంఘటన చేరలేదా?
- మల్లారెడ్డి మీద క్రిమినల్ చర్యలు తీసుకోరా?
- డయాస్ మీద నుంచి విద్యార్థులనే బెదిరిస్తారా?
- ఇక కాలేజీలో ఈవెంట్లు జరగకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తారా?

## చేసేవి పాడు పనులు..చెప్పేవి నీతి సుద్దులు! విద్యా వ్యవస్థకే మల్లారెడ్డి చీడ పురుగు!?

- మొఖానికి రంగేసుకొని సినిమాలు చేసుకో!?
- నోరు తెరిస్తే అబద్దాలతో పూట గడుపుతున్నావు?
- విద్యా ముసుగులో విద్యార్థుల జీవితాలు ఆగం చేస్తున్నావు?
- నీ సినిమా షోకుతో వేలాది మంది విద్యార్థుల మెదడు పాడుచేస్తున్నావు.
- అబద్దాలతో అందలం ఎక్కినా ఇంకా మానుకోలేక పోతున్నాడు.
- ఎంపీగా అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేశాడు.
- ఇంటింటికీ సొంత నిధులతో నీళ్లిస్తా అని చెప్పి మర్చిపోయాడు.
- బీఆర్ఎస్ లో చేరినప్పుడే ఆదర్శాలను వదిలేశాడు.
- చదువుల కోసమా! ఈవెంట్ల కోసమా!!
- మల్లారెడ్డి కాలేజీలలో ఫైన్ ఆర్ట్స్ కోర్సులున్నాయా?

- దేశానికి టెక్నికల్ మేధావులను అందించే కాలేజీలలో సినిమా ఈవెంట్లు నిర్వహిస్తారా?
- విద్యాలయాల ప్రాంగణం లో సినిమా ఫంక్షన్ ఈవెంట్లు నిషేధం!
- విద్యాలయాల ప్రాంగణాల్లో నిరసనలే నిషేధం!
- విద్యా వ్యవస్థ, దేశ భవిష్యత్తు వంటి అంశాలు తప్ప ఇతర కార్యక్ర మాలు నిర్వహించడం నేరం.
- రాజకీయ సభలకే అనుమతి ఉండదు.
- విద్యార్థి రాజకీయాలు తప్ప ఇతర నాయకులు కూడా రావడం నిషిద్ధం.
- ప్రభుత్వ పెద్దలు తప్ప ఇతరులు ఎవ్వరూ సభలు, సమావేశాలలో పాల్గొన కూడదు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

**హైదరాబాద్, నేటిధాత్రి:**

మల్లారెడ్డి కాలేజీల సమూహమా? లేక వినోద కేంద్రమా? అనే ప్రశ్న ఇప్పుడు సమాజంలో తలెత్తుతోంది. పాలమ్మిన,పూలమ్మిన కష్టపడిన అని గొప్పలు చెప్పుకునే మల్లారెడ్డి ఆదర్శమా? లేక విద్యా వ్యవస్థకే అవమానమా? ఒక బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధి మాట్లాడాల్సిన మాటలా? చేయాల్సిన చేష్టలా? అనుసరించాల్సిన విదానాలా? నోరు వుంది కదా? అని ఏది పడితే అది వింటున్నారు. అనుకున్నప్పుడు నోరు జారడం అలవాటు చేసుకుంటారు. అదే పదే పదే వల్లె వేస్తుంటారు. మల్లారెడ్డి విద్యా సంస్థల అదినేతగా వుండి అడ్డగోలు మాటలు మాట్లాడినప్పుడే సమాజం,రాజకీయ వ్యవస్థ, మీడియి ప్రశ్నిస్తే ఇలాంటి దుర్మార్గాలు జరకుండా పోయేవి. కాలేజీకి సంబంధించిన కార్యక్రమాల్లో డబ్బున్న అమ్మాయిలను పడేసి పెండ్లి చేసుకోండి? లైఫ్ సెట్ చేసుకోండి? అని మల్లారెడ్డి చిల్లర మాటలు మాట్లాడినప్పుడే విద్యార్ధి సంఘాలు తిరగబడాల్సింది. కాని అప్పుడు పెద్దగా పట్టించుకోలేదు. కాన్సర్ అనేది చిన్న గా మొదలైనప్పుడే వైద్యం చేయించుకోవాలి. శరీరం మీద పుండు పుడుతున్నప్పుడే చికిత్స చేసుకోవాలి. లేకుంటే ప్రాణాలు పోవచ్చు. శరీరంలో అవయవాలు తొలగించుకోవాల్సి రావొచ్చు. ఏ విద్యా సంస్థ అదినేతలైనా విద్యార్ధులను కష్టపడి చదువుకోవాలని సూచించాలి. వాళ్లు చదువుకునే చదువులో అద్భుతాలు సృషించాలని చెప్పాలి. దేశానికి అవసరమైన పరిశోధనలు జరగాలని చెప్పాలి. తమ విద్యను,విజ్ఞానాన్ని దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవాలని చెప్పాలి. అంతే కాని చిల్లర మాటలు మాట్లాడి విద్యార్ధులను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేసినప్పుడే క్రిమినల్‌కేసులు నమోదు చేయాల్సింది. కాని ప్రజాప్రతినిధి ముసుగులో వుండడం వల్ల చెల్లిపోయింది. ఇప్పుడే ఏకంగా కాలేజీ ప్రాంగణాన్ని వినోద కేంద్రంగా మార్చేశారు. సినిమా ఈవెంట్లకు వేదికలు చేశాడు. అది కూడా సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ జారీ చేసిన సినిమా ప్రమోషన్ ఈ వెంటును మల్లారెడ్డి యూనివర్సిటీ కాలేజీలో నిర్వహించారు. ఇది నేరం. ఒక సినిమాకు ఏ సర్టిఫికెట్ ఇచ్చారంటేనే అది అన్ని వయసుల వాళ్లు చూసే సినిమాకాదు. అందులో అశ్లీలం వుండొచ్చు. సమాజాన్ని చెడగొట్టే అంశాలు వుండొచ్చు. అసాంఘీక కార్యకలాపాలు చూపించి వుండొచ్చు. అలాంటి సినిమా ప్రమోషన్ చేయడానికి కనీసం సిగ్గుండాలి. నైతిక విలువలు లేని వాళ్ల చేతిలో విద్యా వ్యవస్థ బందీ అయితే ఇలాంటి దుర్మార్గాలే జరుగుతాయి. మల్లారెడ్డి కాలేజీలో ఇటీవల ఈవెంట్ జరిగిన సినిమా హీరో యాశ్ ఈ సినిమాను చిన్న పిల్లలు చూడొద్దు. 18 ఏళ్ల వయసులోపు పిల్లలకు టిక్కెట్లు ఇవ్వొద్దు. అని ప్రకటించారు. అలాంటి సినిమా ప్రమోషన్ ఈవెంట్ కాలేజీలో నిర్వహించానికి బుద్ది వుండొద్దా? మల్లారెడ్డికాలేజీలలో చదువుకునే వాళ్లులో 18 ఏళ్ల వయసుకు తక్కువగా వున్న విద్యార్థులు లేరా? వాళ్లను

12 లో




# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

మంగళవారం 25-08-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 136 రూ॥ 6.00


# గ్రానైట్ మైనింగ్ మాఫియా కబంధ హస్తాల్లో తెలంగాణ పర్యావరణం

## అభివృద్ధి పేరుతో ధ్వంసమవుతున్న ప్రకృతి... అక్రమ గ్రానైట్ మైనింగ్‌తో విపత్తు ఎదుర్కొంటున్న తెలంగాణ.




ఎపిసోడ్-1






## రూ.750 కోట్ల రాయల్టీ స్కామ్ కథ కంచికేనా?

## అక్రమ గ్రానైట్ మైనింగ్‌తో దెబ్బతింటున్న పర్యావరణం

- గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న వన్యప్రాణులు
- భారీ శబ్దాలతో గ్రామ ప్రజలు, మూగజీవాల్లో భయం




- అడుగంటుతున్న భూగర్భజలాలు
- తాగునీటి సమస్యతో గ్రామాలు విలవిల
- రసాయన వ్యర్థాలతో నీరు కలుషితం
- గ్రానైట్ ధూళితో పంటలు ధ్వంసం
- ధూళి కప్పేసిన చెట్లు..మరణిస్తున్న వైనం
- ఎన్ఓసీలకోసం గ్రామసభలపై తీవ్రమైన ఒత్తిళ్లు
- రాజకీయ నేతల చేతుల్లోనే గ్రానైట్ క్వారీలు
- గుట్టలు మాయమై ప్లాట్లుగా మారుతున్న వైనం
- స్మశానాన్ని తలపిస్తున్న చారిత్రక గ్రామం ఎలగందుల

హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణలో అక్రమ గ్రానైట్ యూనిట్ల కారణంగా కొండలు ధ్వంసమవడం, భారీ శబ్దాలు, కాలుష్యం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోవడం, వన్యప్రాణులు గ్రామాల్లోకి రావడం జరుగుతోంది. గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ల నుంచి వెలువడే దుమ్ము, ధూళి గాలిని కలుషితం చేస్తున్నాయి. పేలుళ్ల వల్ల వచ్చే భారీ శబ్దాలు ప్రజలను, మూగజీవాలను భయబ్రాంతుల కు గురిచేస్తున్నాయి. ఇష్టానుసారంగా తవ్వకాలు జరపడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయి తాగునీటి సమస్య ఏర్పడుతోంది. రసాయన వ్యర్థాలతో నీటి వనరులు కలుషితమవుతున్నాయి. ఇ ష్టానుసారంగా తవ్వకాలు జరపడంవల్ల భూగర్భ జలాలు తగ్గిపోయి తాగునీటి సమస్య ఏర్పడుతోంది. రసాయన వ్యర్థాలతో నీటివనరులు కాలుష్యమయమవుతున్నాయి. పచ్చని కొండలు కనుమరుగవడంతో పక్షులు జంతువులు ఆవాసాలు కోల్పోయి అడవి జంతువులు జనావాసాలవైపు వ స్తున్నాయి. క్వారీలు, క్రషర్ల నుంచి వచ్చే ధూళి వల్ల పొలాలు పాడైపోయి రైతులు నష్టపోతున్నారు.



## కరీంగనర్ జిల్లా పర్యావరణానికి ముప్పు

కరీంనగర్ జిల్లాలో అక్రమ గ్రానైట్ మాఫియా పర్యావరణాన్ని తీవ్రంగా నాశనం చేస్తోంది, దీనివల్ల స్థానిక గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులు మరియు తీవ్ర నీటి కొరతతో అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని కొత్తపల్లి, గంగాధర, తిమ్మాపూర్, సైదాపూర్ మండలాల్లో వందలాది క్వారీలు నిబంధనలను ఉల్లంఘిస్తూ తవ్వకాలు జరుపుతున్నాయి. అసిఫ్ నగర్, బావూపేట, కొత్తపల్లి గ్రామాల్లోని గ్రానైట్ కటింగ్ మరియు పాలిషింగ్ యూనిట్ల నుంచి వచ్చే సిలికా ధూళి వల్ల గాలి పూర్తిగా కలుషితమైంది. దీంతో స్థానికులు ఆస్తమా, క్షయ వంటి వ్యాధుల బారిన పడుతు న్నారు. తెలంగాణలోనే ఏకైక జియో-హెరిటేజ్ సైట్ అయిన పాండవులగుట్ట సమీపంలోని గ్రానైట్ క్వారీలు కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) నిబంధనలను ఉల్లంఘిస్తూ ధూళిని వెదజల్లుతున్నాయి. క్వారీల వ్యర్థాలు మరియు రసాయనాలు స్థానిక వాగులు, చెరువుల్లో కలవడం వల్ల తాగునీరు విషపూరితంగా మారుతోంది. భూగర్భ జలాల మట్టం కూడా భారీగా పడిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో కూడా జిలెటిన్ స్టిక్స్‌తో కొండలను పేల్చడం వల్ల చుట్టుపక్కల ఇళ్లు దెబ్బతింటున్నాయి. శబ్ద కాలుష్యం తీవ్రస్థాయికి చేరింది. అసిఫ్ నగర్ ప్రాంతంలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై స్థానికులు రాసిన లేఖను తెలంగాణ హైకోర్టు సుమోటో పిల్ గా స్వీకరించి, రాష్ట్ర ప్రభుత్వానికి మరియు కాలుష్య నియంత్రణ మండలికి నోటీసులు జారీ చేసింది.

## రూ. 750 కోట్ల రాయల్టీ స్కామ్

గ్రానైట్ వ్యాపారులు అనుమతించిన దానికంటే ఎక్కువ తవ్వకాలు జరిపి, తప్పుడు పర్మిట్లతో చైనా మరియు మధ్యప్రాచ్య దేశాలకు ఓడరేవుల ద్వారా అక్రమంగా ఎగుమతి చేశారు. దీనిపై ఈడీ మరియు సీబీఐ సంస్థలు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నాయి. రూ. 750 కోట్ల గ్రానైట్ రాయల్టీ స్కామ్ అనేది కరీంనగర్ జిల్లాలో జరిగిన ఒక భారీ మైనింగ్ మరియు పన్ను ఎగవేత కుంభకోణం. కరీంనగర్ నుండి విదేశాలకు ఎగుమతి అయ్యే గ్రానైట్ బ్లాకులపై ప్రభుత్వానికి



చెల్లించాల్సిన రాయల్టీ (సీనియరేజ్ ఫీజు) చెల్లించకుండా మైనింగ్ వ్యాపారులు పెద్ద ఎత్తున మోసానికి పాల్పడ్డారు. గ్రానైట్ ఏజెన్సీలు క్వారీల నుండి అనుమతించిన దానికంటే ఎక్కువ మొత్తంలో గ్రానైట్ బ్లాకులను తవ్వి తీశాయి. రికార్డులలో మాత్రం తక్కువ పరిమాణాన్ని చూపిస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగవేసాయి. కరీంనగర్ నుండి ఈ అక్రమ గ్రానైట్ బ్లాకులను రైల్వే వ్యాగన్ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, కలష్ణపట్నం ఓడరేవులకు తరలించారు. అక్కడి నుండి చైనా, హాంకాంగ్ మరియు మధ్యప్రాచ్య దేశాలకు అక్రమంగా ఎగుమతి చేశారు.రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జరిపిన ప్రాథమిక విచారణలో 9 ప్రముఖ గ్రానైట్ ఏజెన్సీలు దాదాపు రూ. 124 కోట్ల మేర పన్ను (రాయల్టీ) ఎగవేసినట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం పన్ను ఎగవేసినందుకు సదరు సంస్థలపై ఐదు రెట్ల జరిమానా విధించాలని విజిలెన్స్ విభాగం సిఫార్సు చేసింది. ఆ పన్ను మరియు జరిమానా మొత్తం కలిపి సుమారు రూ. 749 కోట్లకు (దాదాపు రూ. 750 కోట్లు) చేరింది. ఈ అక్రమ ఎగుమతుల ద్వారా వచ్చిన డబ్బును అధికారిక బ్యాంకు ఖాతాల్లో చూపించకుండా హవాలా మార్గాల్లో దారి మళ్లించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గుర్తించింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘనలపై ఈడీ కరీంనగర్‌లోని పలు గ్రానైట్ వ్యాపారుల ఇళ్లపై దాడులు చేసింది. పనామా లీక్స్‌లో పేరున్న చైనాకు చెందిన ఒక వ్యక్తి ద్వారా హవాలా రూపంలో లోన్ల పేరిట నిధులు మళ్లినట్లు ఈడీ దాడుల్లో బయటపడింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ గ్రానైట్ అక్రమ రవాణాపై సమగ్ర విచారణ కోసం రాష్ట్ర క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) విచారణకు ఆదేశించారు. రూ. 750 కోట్ల కరీంనగర్ గ్రానైట్ స్కామ్‌లో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులు మరియు ప్రధాన వ్యాపార సంస్థల పాత్ర ఉన్నట్లు దర్యాప్తు సంస్థల విచారణలో తేలింది. జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) విచారణలో కొందరు వ్యాపారులు తమ భార్యలు లేదా స్నేహితుల ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి బినామీ పేర్లతో నకిలీ సంస్థలను సృష్టించినట్లు తేలింది.ఈ బినామీ షెల్ కంపెనీల ద్వారా సుమారు రూ. 100 కోట్ల విలువైన నకిలీ వే-బిల్లులను సృష్టించి, అసలు జీఎస్టీ ఫైలింగ్‌లో చూపించకుండా నిధులను పక్కదారి ప ట్టించారు. అక్రమంగా ఎగుమతి చేసిన గ్రానైట్ సొమ్మును చైనాకు చెందిన 'లి వెన్హువోస (పనామా లీక్స్ లో పేరున్న వ్యక్తి) అనే వ్యాపారవేత్త ద్వారా ఎలాంటి పత్రాలు లేకుండా హ్యాండ్ లోన్ల రూపంలో తిరిగి ఇండియాకు మళ్లించినట్లు ఈడీ నిర్ధారించింది.

## ఇతర జిల్లాల్లో పర్యావరణ నష్టం

తెలంగాణలో కేవలం కరీంనగర్ మాత్రమే కాకుండా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ వంటి ఇతర జిల్లాలు కూడా గ్రానైట్ మైనింగ్ వల్ల తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని చవిచూస్తున్నాయి. కరీంనగర్‌లో 'టాన్ బ్రౌన్' రకం ప్రసిద్ధి చెందితే, వరంగల్ మరియు ఖమ్మం జిల్లాలలో లభించే అత్యంత విలువైన 'జెట్ బ్లాక్' (నల్ల గ్రానైట్) క్వారీల వల్ల ఆయా ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.వరంగల్ రూరల్, ఆత్మకూరు, ఎల్కతుర్తి, ధర్మసాగర్ మండలాల్లో భారీగా విస్తరించిన బ్లాక్ గ్రానైట్ క్వారీల నుంచి వచ్చే వ్యర్థాలను (స్లర్రీ మరియు పొడి దుమ్ము) బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీనివల్ల స్థానిక రైతులు సాగు భూములు నాశనమై తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. క్వారీ తవ్వకాల కోసం భూమిని వందల అడుగుల లోతుకు తవ్వడం వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నా యి.కొండలను, గుట్టలను ఇష్టానుసారంగా క్వారీ ఓనర్లు బద్దలు కొడుతుండటంతో.. వాటిపై ఆధారపడి బతికే స్థానిక వెనుకబడిన వర్గాల జీవనోపాధి దెబ్బతింటోంది. ఉదాహరణకు, గొర్రెల కాపరులకు మేత మైదానాలు లేకుండా పోవడం, అడవి ఉత్పత్తులపై ఆధారపడే గిరిజనులు నష్టపోవడం జరుగుతోంది.ఖమ్మం మరియు కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతాల సరిహద్దుల్లో జరిగే గ్రానైట్ మైనింగ్ వల్ల పచ్చని అడవులు అంతరించిపోతున్నాయి. వందలాది టన్నుల బరువుండే గ్రానైట్ బ్లాకులను భారీ టిప్పర్లలో తరలించడం వల్ల గ్రామీణ రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. లారీల నుంచి వచ్చే విపరీతమైన దుమ్ము వల్ల రోడ్డు పక్కన ఉండే ఇళ్లు, పొలాలు పూర్తిగా తెల్లటి ధూళితో నిండిపోతున్నాయి. క్వారీల్లో రాళ్లను పగులగొట్టడానికి వాడే జాక్ హేమర్ డ్రిల్లింగ్, వైర్ సా కట్టింగ్‌ల వల్ల గాలిలోకి ప్రమాదకరమైన సిలికా దుమ్ము చేరుతున్నది. ఇది గాలిలో కలిసిపోవడం వల్ల మైనింగ్‌కార్మికులతో పాటు సమీప గ్రామ ప్రజలు సైంటిఫిక్‌గా 'సిలికోసిస్' మరియు క్రానిక్ బ్రోన్కైటిస్ వంటి ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రస్తుతం పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలు మరియు అక్రమ తవ్వకాలపై తెలంగాణ శాసనసభలో సైతం చర్చలు జరిగాయి, ప్రభుత్వం చట్టవిరుద్ధమైన మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక కమిటీల ద్వారా నిఘా పెంచుతోంది.

## శ్మశానాన్ని తలపిస్తున్న ఎలగందుల

కరీంనగర్ జిల్లాలోని చారిత్రాత్మక పర్యాటక గ్రామమైన ఎలగందుల మరియు దాని చుట్టుప క్కల గ్రామాలు ఈ అక్రమ గ్రానైట్ మైనింగ్ వల్ల శ్మశానాలను తలపిస్తున్నాయి. ఎలగందుల చుట్టూ ఉన్న పచ్చని కొండలను గ్రానైట్ మాఫియా డైనమైట్లతో బద్దలు కొడుతుండటంతో పర్యావరణమే కాకుండా, శతాబ్దాల నాటి చారిత్రక సంపద కూడా సమాధవుతోంది. ఎలగందుల గ్రామంలో శతాబ్దాల చరిత్ర కలిగిన ప్రసిద్ధ ' ఎలగందుల కోట' ఉంది. క్వారీలలో రాళ్లను పగులగొట్టడానికి రాత్రి పగలు తేడా లేకుండా వాడే భారీ జిలెటిన్ స్టిక్స్ మరియు డైనమైట్ పేలుళ్ల వల్ల వచ్చే భూప్రకంపనల కారణంగా ఈ కోట గోడలు, బురుజులు పగుళ్లు ఇస్తున్నాయి. ఒకప్పుడు పర్యాటకులతో కలకలలాడిన ఈ ప్రాంతం ఇప్పుడు మైనింగ్ దుమ్ము, ధూళి, భారీ శబ్దాలతో నిండిపోవడంతో పర్యాటకులు రావడం తగ్గించేశారు. గ్రామానికి అతి సమీపంలో పేలుళ్లు జరుపుతుండటంతో ఎలగందులలోని సామాన్య ప్రజల ఇళ్లు బీటలు వారుతున్నాయి. ఎప్పుడు ఏ ఇల్లు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళనలతో గడుపుతున్నారు. క్వారీలలో పేల్చే రాళ్ల ముక్కలు ఒక్కోసారి గాల్లో ఎగురుతూ వచ్చి కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామంలోని ఇళ్లపై, పశువుల పాకలపై పడి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలిగిస్తున్నాయి. గ్రానైట్ కటింగ్ యంత్రాల నుండి వచ్చేతెల్లటి క్వార్ట్జ్ పొడి/సిలికా దుమ్ము ఎలగందుల గ్రామాన్ని ఎప్పుడూ మంచులా కమ్మేసి ఉంటుంది.దీనివల్ల ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారి చిన్న పిల్లల నుండి ముసలివారి వరకు అందరూ ఆస్తమా, ఊపిరితిత్తుల క్యాన్సర్, మరియు ప్రాణాంతకమైన 'సిలికోసిస్' వ్యాధుల బారిన పడుతున్నారు. చెట్లపై ఈ దుమ్ము దట్టంగా పేరుకుపోవడం వల్ల కిరణజన్య సంయోగ క్రియ జరగక గ్రామంలోని చెట్లు ఎండిపోతున్నాయి. కొండలను పిండి చేయడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గం మూసుకుపోయింది. మైనింగ్ క్వారీలు వందల అడుగుల లోతుకు వెళ్లడంతో చుట్టుపక్కల వ్యవసాయ బోర్లు, తాగునీటి బావులు ఎండిపోయాయి. గ్రానైట్ కటింగ్ కోసం వాడే ర సాయనాలతో కూడిన నీరు (స్లర్రీ) స్థానిక వాగుల్లోకి, చెరువుల్లోకి చేరి తాగునీరు విషపూరితంగామారుతోంది. 20 నుండి 40 టన్నుల బరువైన గ్రానైట్ బ్లాకులను మోసుకెళ్లే వందలాది ఓవర్ లోడెడ్ లారీలు నిత్యం ఎలగందుల గ్రామం గుండా ప్రయాణించడం వల్ల గ్రామీణ రోడ్లు పూర్తి గా ధ్వంసమై పెద్ద పెద్ద గోతులుగా మారాయి. దీనివల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు.గ్రానైట్ మాఫియా ఇక్కడి సహజ సిద్ధమైన కొండలను మైదానాలుగా మార్చేస్తుండటంతో, గ్రానైట్ మాఫియా ఇక్కడి సహజ సిద్ధమైన కొండలను మైదానాలుగా మార్చేస్తుం డటంతో, ఎలగందుల గ్రామం తన ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడింది.



## మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ పోరాటాలు

ఎలగందుల మరియు దాని చుట్టుపక్కల గ్రామాల (బావూపేట, అసిఫ్ నగర్, కొత్తపల్లి) ప్రజలు తమ భూములు, ఆరోగ్యం మరియు చారిత్రక సంపదను కాపాడుకోవడానికి మైనింగ్ కంపెనీలకు వ్యతిరేకంగా అనేక సంవత్సరాలుగా ఉమ్మడిగా పోరాటాలు చేస్తున్నారు. రాజకీయ అండదండలు ఉన్న గ్రానైట్ మాఫియా బెదిరింపులకు భయపడకుండా స్థానిక మహిళలు, యువకులు మరియు పర్యావరణ ప్రేమికులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. క్వారీల నుంచి వందలాది భారీ గ్రానైట్ లారీలు గ్రామం గుండా వెళ్తూ రోడ్లను ధ్వంసం చేయడంతో పాటు విపరీతమైన దుమ్మును లేపడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలగందుల, బావూపేట ప్రధాన రహదారులపైమహిళలు వంటా-వార్పు కార్యక్రమాలు చేపట్టి, లారీలను రోజుల తరబడి కదలకుండా అడ్డుకున్నారు. కాలుష్య నిబంధనలు పాటించకుండా ఇళ్లకు సమీపంలో ఏర్పాటు చేసిన గ్రానైట్ కటింగ్‌మరియు పాలిషింగ్ ఫ్యాక్టరీల ముందు స్థానికులు నిరసనలు ప్రదర్శించారు. ఎలగందుల ఖిల్లా (కోట) సమీపంలో జరుగుతున్న బ్లాస్టింగ్స్ వల్ల కోట బురుజులు కూలిపోయే ప్రమాదం రావడంతో స్థానిక యువకులు ఒక కమిటీగా ఏర్పడ్డారు. "ఖిల్లాను కాపాడండి - మైనింగ్‌ను ఆపండి" అనే నినాదంతో కరీంనగర్ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. కోట పరిధిలో ఉన్న మైనింగ్ లీజులను రద్దు చేయాలని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ( మరియు రాష్ట్ర పురావస్తు శాఖ పై ఒత్తిడి తెచ్చారు. క్వారీల యాజమాన్యాలు స్థానిక పోలీసుల సాయంతో గ్రామస్తుల నిరసనలను అణచివేయడానికి ప్రయత్నించి నప్పుడు, బాధితులు నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.అసిఫ్ నగర్ మరియు ఎలగందుల పరిసరాల్లో జరుగుతున్న పర్యావరణ విధ్వంసం, ప్రజల అనారోగ్యంపై గ్రామస్తులు తెలంగాణ హైకోర్టుకు లేఖలు రాశారు. ఈ లేఖలను తీవ్రంగా పరిగణించిన హైకోర్టు, దీనిని పిల్‌గా స్వీకరించి విచారణ జరిపింది. మైనింగ్ కంపెనీలు కాలుష్య నియం త్రణ మండలి (టీజీపీసీబీ) నిబంధనలను పాటించకపోతే వాటిని మూసివేయాలని ఆదేశాలు జారీ చేయడంలో గ్రామస్తుల లీగల్ పోరాటం సఫలమైంది. ఎలగందుల మరియు సమీప గ్రామ పంచాయతీల్లో గ్రామస్తులంతా ఏకమై, తమ పరిధిలో కొత్తగా ఎలాంటి గ్రానైట్ క్వారీలకు లేదా క్రషర్లకు అనుమతులు (ఎన్ ఓసీ) ఇవ్వబోమని గ్రామసభల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాల కాపీలను మైనింగ్ శాఖ అధికారులకు పంపి ఒత్తిడి తెచ్చారు. ఈ ప్రజా ఉద్యమాల వల్లేకరీంనగర్ గ్రానైట్ మాఫియాపై విజిలెన్స్, ఈడీ వంటి కేంద్ర సంస్థలు కూడా దృష్టి పెట్టాల్సి వచ్చింది.


మిగా 4 లో



# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



మంగళవారం 25-08-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 136 రూ॥ 6.00




## హెచ్ఎండీఏ కమిషనర్‌తో రఘునందన్ రావు భేటీ

**పెండింగ్ రోడ్డు, రైల్వే పనుల పూర్తికి అభ్యర్థన**

హైదరాబాద్, నేటిధాత్రి:
మెదక్ పార్లమెంట్ పరిధిలోని పెండింగ్ పనులపై ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌తో సమావేశమయ్యారు.
పటాన్‌చెరు-సంగారెడ్డి మెట్రో పొడిగింపు, పటాన్‌చెరు ఎగ్జిట్-3 నుంచి ఎగ్జిట్-4, సుల్తాన్‌పూర్ మధ్య సర్వీస్ రోడ్లు, కొల్లూరు ఎగ్జిట్-2 వద్ద పెండింగ్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు.



# తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర



## -నన్ను అడ్డుకున్నా.. నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

- గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోదీ
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం
- అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం
- పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ మండిపాటు

హైదరాబాద్, నేటిధాత్రి:
పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే తన అమెరికా పర్యటనకు కేంద్రం దురుద్దేశపూర్వకంగా అనుమతి నిరాకరించిందని ఆరోపించారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని, అందుకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు.

### ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ ఆలోచనగా వివరించారు.
గుజరాత్ సీఎంకు అనుమతి.. తెలంగాణ సీఎంకు నిరాకరణ
గుజరాత్ సీఎంకు అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎంగా తన పర్యటనకు నిరాకరించడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికాలో పర్యటించి పెట్టుబడులు ఆకర్షించారని గుర్తుచేశారు. తన పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### పెట్టుబడులు గుజరాత్‌కు మళ్లించే కుట్ర

తెలంగాణకు వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకునేందుకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీ దేశ ప్రధానిగా కాకుండా గుజరాత్ ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.
రాజకీయ కారణాలతోనే అనుమతి నిరాకరణ
అమెరికాలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు కేంద్రానికి ముందే పూర్తి వివరాలు అందించామని సీఎం తెలిపారు. రాజకీయ కారణాలతోనే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ నుంచి సమాధానం వచ్చిందని చెప్పారు. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతించి.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

### నా పర్యటనను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు


"నా పర్యటనను అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నన్ను అడ్డుకున్నా.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన" అని రేవంత్ స్పష్టం చేశారు. కేంద్రానికి తెలంగాణపై చులకన భావం ఉందని ఆరోపించారు.
పార్లమెంటులో నిలదీస్తాం
తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ అంశాన్ని రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పార్లమెంటులో ప్రస్తావిస్తారని రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్రం వివక్షను సహించేది లేదన్నారు. తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులను అడ్డుకునే ప్రయత్నాలను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

### డిసెంబరులో పెట్టుబడుల సదస్సు

కేంద్రం తనను అడ్డుకున్నా తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను అడ్డుకోలేదని సీఎం అన్నారు. డిసెంబరులో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి వివరిస్తామని వెల్లడించారు.
కేంద్ర వైఖరితో సంబంధాలు దెబ్బతింటున్నాయి
మోదీ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకే అభివృద్ధి పరిమితం చేయడం సరికాదన్నారు.
ఈ మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**




హైదరాబాద్, నేటిధాత్రి:
కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అదనపు సాయం కొనసాగించేందుకు హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు దివ్యాంగులకు సంబంధించి విధించిన స్టేను ఎత్తివేసింది. దివ్యాంగ వధువులకు సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే 25 శాతం అదనపు ఆర్థిక సాయం అందించేలా ప్రభుత్వం గతంలో జీవో జారీ చేసింది. మిగిలిన లబ్ధిదారులకు సంబంధించిన స్టే మాత్రం కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## నకిలీ డీఎస్పీగా ప్రజలకు టోపీ

- రూ.1.20 కోట్లు వసూళ్లు
- వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు




హైదరాబాద్, నేటిధాత్రి:
నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి మోసాలకు పాల్పడుతున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును సీసీఎస్ ఈఓడబ్ల్యూ పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుని ఉన్నతాధికారులతో పరిచయాలున్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి ఓ బాధితుడి నుంచి రూ.1.20 కోట్లు తీసుకున్నట్లు గుర్తించారు. తెలంగాణ, ఏపీలోనూ ఇదే తరహాలో మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడిపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో కొండా సురేఖ వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాలో బతికేస్తున్న కేటీఆర్
- మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పీసీసీ చీఫ్



మెదక్, నేటిధాత్రి:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది.
ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు.
ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసీసీకి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. "కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మినాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారు" అని తెలిపారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు.



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం

**విదేశీ హైబ్రిడ్ విత్తనాలపై ఆధారపడటం తగ్గించాలి**

- కొత్త నాన్-జీఎంఓ మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి
- రైతులు స్వయం సమృద్ధి దిశగా సాగాలి: రాధాకృష్ణన్



ముసునూరు, నేటిధాత్రి:
విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి.. స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత, స్వయం సమృద్ధి సాధించాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రైతులకు సూచించారు. ఏలూరు జిల్లా ముసునూరులో గోర్మే పాప్‌కార్న్‌కా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబుతో కలిసి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న కొత్త వంగడాన్ని ఆయన ఆవిష్కరించారు.

### వ్యవసాయమే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

దేశ జీడీపీలో వ్యవసాయ రంగం సుమారు ఐదో వంతు వాటా కలిగి ఉందని రాధాకృష్ణన్ తెలిపారు. 46.1 శాతం మందికి ఉపాధి, 55 శాతం జనాభాకు జీవనాధారం వ్యవసాయమేనన్నారు. పీఎం-కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నమో డ్రోన్ దీదీ వంటి పథకాలు రైతులకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు.
ఎనిమిది రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు సుమారు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ సాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో భారత్ పాప్‌కార్న్‌ను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతులు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

### ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా ఎదగాలి

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాలను ముసునూరులో ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న దేశంలో మూడో అతిపెద్ద పంటగా ఉందన్నారు.
వాతావరణ మార్పులను తట్టుకునేలా పరిశోధనలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ వాతావరణానికి అనుకూలమైన హైబ్రిడ్ విత్తనాలను అభివృద్ధి చేస్తున్న గోర్మే పాప్‌కార్న్‌కా సంస్థను అభినందించారు. అరకు కాఫీ తరహాలో పాప్‌కార్న్ కూడా ప్రపంచస్థాయి బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

### రైతులకు విలువ జోడించేలా ప్రాసెసింగ్

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఆహార శుద్ధి పరిశ్రమల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ పెంచి రైతులకు అధిక ఆదాయం కల్పించవచ్చన్నారు. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.
నూజివీడు ప్రాంతంలో పండే పాప్‌కార్న్ మొక్కజొన్న దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి అవుతోందన్నారు. ఇప్పటివరకు పాప్‌కార్న్ కోసం విదేశాలకు వెళ్లిన సంపద ఇకపై దేశంలోనే ఉండేలా దేశీయ విత్తనాల ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

### నదుల అనుసంధానంతో సాగునీటి సమస్యకు పరిష్కారం

దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం ద్వారా నీటిని సమర్థంగా వినియోగించుకోవాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన అని చంద్రబాబు తెలిపారు. గోదావరి-కృష్ణా, తుంగభద్ర-పెన్నా-కావేరీ నదుల అనుసంధానంతో నాలుగు రాష్ట్రాల్లో సాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కొలుసు పార్థసారథి, కింజరాపు అచ్చెన్నాయుడు, గోర్మే పాప్‌కార్న్‌కా సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వరబాబు, మహీధర్‌రెడ్డి, యుగంధర్, ప్రిఫర్డ్ పాప్‌కార్న్ సీఈఓ నార్మ్ కూర్గ్ తదితరులు పాల్గొన్నారు. పాప్‌కార్న్ ఉత్పత్తిలో విశేష సేవలందించిన రైతులను ఉపరాష్ట్రపతి సన్మానించారు. అతిథులను సంస్థ ప్రతినిధులు దుశ్శాలువా, కొండపల్లి బొమ్మలతో సత్కరించారు.

## 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**98 శాతం దరఖాస్తుల పరిష్కారం**

- ప్రభుత్వ భూములను కాపాడటమే లక్ష్యం: పొంగులేటి
- నకిలీ పత్రాలతో భూదందాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు



హైదరాబాద్, నేటిధాత్రి:
22ఏ నిషేధిత జాబితాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూచించారు. 22ఏలో లక్షల ఎకరాలు కొత్తగా చేర్చారన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. 2023 డిసెంబర్ 7 నాటి పరిస్థితులు, ప్రస్తుత వివరాలను కేటగిరీల వారీగా ప్రజల ముందు ఉంచుతున్నామని తెలిపారు.

### 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి

22ఏకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. నిజమైన సమస్యలను 24 గంటల్లో.. అవసరమైతే గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయిన వారికి
ఈ వారాంతంలోపు ఆ మొత్తాన్ని తిరిగి ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

### ప్రభుత్వ భూములు కాపాడతాం

ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా కాపాడటమే 22ఏ ప్రధాన ఉద్దేశమని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపిస్తూ నిర్మాణాలు చేపడితే సహించబోమన్నారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూములపై రికార్డులను పరిశీలించి నిజమైన హక్కుదారులకు న్యాయం చేస్తామని తెలిపారు.

### నకిలీ పత్రాలతో భూదందాలు

నకిలీ జీఓలు, బోగస్ మెమోలు, అధికారుల సంతకాలతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రయత్నాలను గుర్తించామని మంత్రి తెలిపారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

### యుఎల్‌సీపై త్వరలో విధానం

అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సీ)పై త్వరలో విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. యుఎల్‌సీ క్లియరెన్స్ పొందిన భూములకు సంబంధించిన ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు.

### 1,162 ఫిర్యాదులు

22ఏ సమస్యల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని తెలిపారు. పునరావృత ఫిర్యాదులను తొలగించగా 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో 547 వ్యవసాయ, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవన్నారు.
ప్రజలను భయపెట్టడం తమ ప్రభుత్వ విధానం కాదని.. న్యాయబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పిస్తూనే ప్రభుత్వ భూములను కాపాడుతామని పొంగులేటి స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను భయాందోళనలకు గురిచేసేందుకు ప్రభుత్వం అనుమతించదన్నారు.

## లంచం తీసూ నలుగురు అధికారుల పట్టివేత

**యాదాద్రి, నిర్మల్ జిల్లాల్లో ఏసీబీ దాడులు**

**రూ.14 వేల లంచం తీసుకుంటూ ఇద్దరు..**

**రూ.50 వేల స్వీకరిస్తూ మరో ఇద్దరు అరెస్ట్**





యాదాద్రి భువనగిరి/నిర్మల్, నేటిధాత్రి:
అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం యాదాద్రి భువనగిరి, నిర్మల్ జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో నలుగురు అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

### రూ.14 వేల లంచం.. ఇద్దరు పట్టివేత

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేముగంటి పూర్ణచందర్‌రావు, గ్రామ పాలనాధికారి షేక్ అహ్మద్ ఫిర్యాదుదారుడి నుంచి రూ.14 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

### రూ.50 వేల తీసుకుంటూ..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పన్నుల శాఖ నిర్మల్ సర్కిల్ కార్యాలయంలో మరో ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎస్టీవో కొప్పెల గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణ. ఫిర్యాదుదారుడి నుంచి రూ.50 వేల స్వీకరిస్తుండగా ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

### రూ.లక్ష డిమాండ్.. రూ.50 వేలకు ఒప్పందం

2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల ఆడిట్ లెక్కల వ్యవహారంలో అనుకూలంగా నివేదిక ఇవ్వాలని మంచిర్యాల పట్టణానికి చెందిన జువెల్లరీ దుకాణం యజమాని లక్కింశెట్టి వీర భాస్కరరావు అధికారులను సంప్రదించారు. దీంతో ఇద్దరు అధికారులు తొలుత రూ.లక్ష లంచం డిమాండ్ చేసి.. చివరకు రూ.50 వేలకు ఒప్పందం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.
ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించడంతో ముందస్తు వ్యూహం ప్రకారం సోమవారం దాడి చేసి ఇద్దరినీ పట్టుకున్నారు. నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు.


# గ్రానైట్ మైనింగ్ మాఫియా కబంధ హస్తాల్లో తెలంగాణ పర్యావరణం

## అభివృద్ధి పేరుతో ధ్వంసమవుతున్న ప్రకృతి... అక్రమ గ్రానైట్ మైనింగ్‌తో విపత్తు ఎదుర్కొంటున్న తెలంగాణ.


పేలుళ్ల కంపనలు


దుమ్ము కాలుష్యం


రోడ్లపై లారీలు


ఇళ్లకు పగుళ్లు

ఎపిసోడ్-1







## రూ.750 కోట్ల రాయల్టీ స్కామ్ కథ కంచికేనా?

## అక్రమ గ్రానైట్ మైనింగ్‌తో దెబ్బతింటున్న పర్యావరణం

- గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న వన్యప్రాణులు
- భారీ శబ్దాలతో గ్రామ ప్రజలు, మూగజీవాల్లో భయం




- అడుగంటున్న భూగర్భజలాలు
- తాగునీటి సమస్యతో గ్రామాలు విలవిల
- రసాయన వ్యర్థాలతో నీరు కలుషితం
- గ్రానైట్ ధూళితో పంటలు ధ్వంసం
- ధూళి కప్పేసిన చెట్లు..మరణిస్తున్న వైనం
- ఎన్ఓసీలకోసం గ్రామసభలపై తీవ్రమైన ఒత్తిళ్లు
- రాజకీయ నేతల చేతుల్లోనే గ్రానైట్ క్వారీలు
- గుట్టలు మాయమై ప్లాట్లుగా మారుతున్న వైనం
- స్మశానాన్ని తలపిస్తున్న చారిత్రక గ్రామం ఎలగందుల



మొదటి పేజీ తరువాయి

### సామాజిక కార్యకర్తల పాత్ర

కరీంనగర్ మరియు ఎలగందుల ప్రాంతాల్లో మైనింగ్ మాఫియాకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో పలువురు స్థానిక సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు మరియు పర్యావరణ సంస్థలు అత్యంత కీలకమైన పాత్ర పోషించారు. అధికారంలో ఉన్న శక్తుల నుంచి బెదిరింపులు వచ్చినా వెనకడుగు వేయకుండా, వీరు న్యాయస్థానాలు మరియు జాతీయ హరిత ట్రిబ్యునల్ లలో చట్టపరమైన యుద్ధం చేశారు. డి. అరుణ్‌కుమార్ కరీంన గర్‌కు చెందిన స్థానిక సామాజికకార్యకర్త. కొత్తపల్లి మండలం పరిధిలోని ఇలగందుల సరిహద్దు గ్రామమైన అసిఫ్ నగర్ మరి యు బావూపేట ప్రాంతాలలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై ఈయన నిరంతరాయం గాపోరాడారు. ఈయన రాసిన లేఖ ఆధారంగానే తెలంగాణ హైకోర్టు సుమోటో ప్రజా ప్రయోజన వ్యాజ్యం స్వీకరించి, రాష్ట్ర ప్రభుత్వానికి మరియు మైనింగ్ మాఫియాకు నోటీసులు జారీ చేసిం ది. బీజేపీ రాష్ట్ర నాయకుడైన పేరాల శేఖర్ రావు కరీంనగర్ అక్రమ గ్రానైట్ మైనింగ్‌పై జాతీ య స్థాయిలో లీగల్ పోరాటం చేశారు. క్వారీ యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు లేకుండా,పర్యావరణ నియమాలను ఉల్లంఘిస్తూ చేస్తున్న తవ్వకాలపై ఈయన ఎన్‌జీటీ లో పిటిషన్ దాఖలు చేశారు. దీనివల్ల దాదాపు 13 మైనింగ్ సంస్థలు, కాలుష్య నియంత్రణ మండలి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ.ఏ.ఎస్. శర్మ తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని మైనింగ్ అక్రమాలపై గళమెత్తారు. క్వారీల వల్ల భూగర్భ జలాలు విషపూరితంగా మారడంపై ప్రభుత్వాలకు మరియు కేంద్ర పర్యావరణ శాఖకు నివేదికలు పంపి ఒత్తిడి తెచ్చారు. హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధులు (వి.ఎస్. కఅష్ణ వంటి నేతలు) ఎలగందుల, వరంగల్ తదితర మైనింగ్ బాధిత ప్రాంతాల లో క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపారు. క్వారీ కార్మికులు ఎదుర్కొంటున్న సిలికోసిస్ వ్యాధులు, స్థానికులకు జరుగుతున్న అన్యాయాలపై మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మరియు ప్ర భుత్వాలకు నివేదికలు సమర్పించారు. ఎలగందుల గ్రామంలోని స్థానిక యువకులు ఒక వేదికగా ఏర్పడి "ఖిల్లా (కోట) పరిరక్షణ కమిటీ"ని స్థాపించారు. వీరు చారిత్రక కట్టడాల విధ్వంసంపైఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ ఐ) అధికారులకు స్వయంగా ఆధారాలు (పేలుళ్ల వల్ల కోటకు వచ్చిన పగుళ్ల ఫోటోలు) అందజేశారు. బావూపేట మరియు కొత్తపల్లి మండలాల మహిళా సంఘాలు మరియు రైతు సంఘాలు ఉమ్మడిగా కలిసి మైనింగ్ లారీల అక్రమ రవాణాను అడ్డుకుంటూ క్షేత్రస్థాయిలో రాస్తారోకోలు నిర్వహించాయి. ఈ సామాజిక నాయకులు, స్వచ్ఛంద సంస్థల నిరంతర పోరాటం వల్లే.. గ్రానైట్ వ్యాపారుల అక్రమ ఎగుమతులు మరియు రా యల్టీల ఎగవేతపై ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీలో చర్చలు జరగడం, సీఐడీ విచారణ చేపట్టడంసాధ్యమైంది.

### తీవ్రంగా హెచ్చరించిన హైకోర్టు, ఎన్‌జీటీ

తెలంగాణ హైకోర్టు మరియు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) కరీంనగర్ గ్రానైట్ మాఫియా అక్రమాలపై కీలకమైన ఆదేశాలు, తీర్పులు ఇచ్చాయి. పర్యావరణ విధ్వంసం, పన్ను ఎగవేతలపై దాఖలైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానాలు ప్రభుత్వ యంత్రాంగాన్ని మరియు మై నింగ్ సంస్థలను తీవ్రంగా హెచ్చరించాయి. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన మైనింగ్ కంపెనీలపై ఎన్‌జీటీ స్పష్టమైన తీర్పునిచ్చింది. మైనింగ్ జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో ఉన్నప్పటికీ, చెల్లుబాటు



అయ్యే పర్యావరణ అనుమతులు మరియు కాలుష్య నియంత్రణ మండలి నుంచి 'సమ్మతి ఉత్తర్వులు' లేని ఏ క్వారీ కూడా పనులను ప్రారంభించడానికి లేదా కొనసాగించడానికి వీల్లేదని ఆదేశించింది. సామాజిక కార్యకర్త పేరాల చంద్రశేఖర్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా గనులు, భూగర్భ శాస్త్ర శాఖ ఎన్‌జీటీకి కీలక నివేదిక సమర్పించింది. ఎలాంటి అనుమతులు లేకుండా రైల్వే రేకుల ద్వారా గ్రానైట్ బ్లాకులను విదేశాలకు తర లించినట్లు అధికారులు కోర్టుకు తెలిపారు. బకాయిలు చెల్లించని 210 కేసులపై 'రెవెన్యూ రికవరీ చట్టం' కింద కఠిన చర్యలు చేపట్టి ఆ సొమ్మును వసూలు చేయాలని ఎన్‌జీటీ ఆదేశించింది. క రీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం పరిధిలోని అసిఫ్ నగర్, బావూపేట గ్రామాల్లో జరుగుతున్న విచ్చలవిడి గ్రానైట్ తవ్వకాలపై స్థానిక సామాజిక కార్యకర్త డి. అరుణ్ కుమార్ రాసిన లేఖను తెలంగాణ హైకోర్టు అప్పటి చీఫ్ జస్టిస్ బెంచ్ సుమోటో పిల్‌గా స్వీకరించింది. మైనింగ్ కంపెనీల వల్ల వాయు, నీరు, శబ్ద కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి ప్రజల ఆరోగ్యం పాడవుతున్నా అధికారులు సైలెంట్ ప్రేక్షకులుగా మిగిలిపోయారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై మైనింగ్, అటవీ, పర్యావరణ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) మరియు కరీంనగర్ జిల్లా కలెక్టర్ వెంటనే అఫిడవిట్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది.

### ఎన్ని చర్యలు తీసుకున్నా ఆగని మైనింగ్

క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తే ప్రభుత్వం మరియు దర్యాప్తు సంస్థలు తీసుకున్న చర్యలు కేవ లం 'కంటితుడుపు చర్యలు' మాత్రమేననే భావన కలగడం సహజం. వందల కోట్ల జరిమానా లు, ఈడీ దాడులు, హైకోర్టు నోటీసులు ఉన్నప్పటికీ అక్రమ గ్రానైట్ మైనింగ్ యథేచ్ఛగా కొన సాగడానికి వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. తెలంగాణలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, గ్రానైట్ పరిశ్రమను శాసించేది మాత్రం స్థానిక రాజకీయ నాయకులు లేదా వారికి అ త్యంత సన్నిహితులైన వ్యాపారవేత్తలే. అధికార పక్షంలో ఉన్న నాయకుల అండదండలు ఉండ టం వల్లే కిందిస్థాయి అధికారులు క్వారీలపై కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఈ మాఫి యా దగ్గర భారీగా నల్లధనం ఉండటంతో, వీరు చట్టపరమైన లసుగులను ఉపయోగించుకుంటూ కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకుని తవ్వకాలను కొనసాగిస్తు న్నారు. విజిలెన్స్ లేదా మైనింగ్ అధికారులు క్వారీలకు తనిఖీలకు వెళ్లే ముందే స్థానిక సిబ్బంది ద్వారా సమాచారం లీక్ అవు తుంది. దీనివల్ల అధికారులు వెళ్లేసరికి అక్రమ యంత్రాలను, లారీలను పక్కకు తప్పిస్తారు. గ్రీన్ ట్రిబ్యునల్ లేదా కాలుష్య నియంత్రణ మండలి ఒక క్వారీని తాత్కాలికం గా మూసివేసినా, కొన్ని రోజులకే మళ్లీ నామమాత్రపు జరిమానాలు కట్టించి, నకిలీ పర్యావరణ క్లియరెన్సులతో క్వారీలను పున్ణప్రారంభిస్తున్నారు. విజిలెన్స్ శాఖ దాదాపు రూ. 750 కోట్ల జరిమానాలు విధించినట్లు రికార్డుల్లో చూపించినప్పటికీ, అందులో ఎక్కువ శాతం సొమ్మును ఇప్పటివరకు మైనింగ్ వ్యాపారుల నుండి వసూలు చేయలేదు. ఒక సంస్థపై భారీ జరిమానా పడగానే, ఆ వ్యాపారులు అదేక్వారీని తమ బినామీల పేర్లతో కొత్త కంపెనీగా రిజిస్టర్ చేసి మళ్లీ అక్రమ తవ్వకాలు మొదలుపెడుతున్నారు. చైనా మరియు మధ్యప్రాచ్య దేశాలలో తెలంగాణ 'టాన్ బ్రౌన్', 'జెట్ బ్లాక్' గ్రానైట్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడి క్వారీలను కొన్ని రోజులు మూసివేస్తే అంతర్జాతీయ ఆర్డర్లు దెబ్బతింటాయనే సాకుతో, స్థానిక ఆర్థిక వ్యవస్థను అడ్డం పెట్టుకుని మైనింగ్‌ను ఎలాగోలా నడిపిస్తున్నారు. దీనివల్ల, అక్రమ మైనింగ్‌పై జరుగుతున్న విచారణలు కేవలం ప్రజల్లో వస్తున్న ఆగ్రహాన్ని చల్లార్చడానికి మరియు ఎన్నికల సమయంలో ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకోవడానికి మాత్రమే ఉపయోగపడు తున్నాయన్నది స్థానికుల ఆరోపణ.

### పంచాయతీలకు అనుకూలంగా బలమైన చట్టాలు

స్థానిక గ్రామాల సరిహద్దుల్లో, నివాస ప్రాంతాలకు మరియు చారిత్రక కట్టడాలకు సమీపంలో క్వారీలను పూర్తిగా నిషేధించడానికి లేదా అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి భారత రాజ్యాం గం మరియు పర్యావరణ చట్టాలు స్థానిక ప్రజలకు, గ్రామ పంచాయతీలకు బలమైన చట్టపరమైన హక్కులను కల్పించాయి.రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ ప్రకారం గ్రామ సరిహద్దుల్లోని సహజ వనరులపై గ్రామసభకు పూర్తి హక్కులు ఉన్నాయి. గ్రామానికి నష్టం కలిగించే ఎలాంటి మై నింగ్ లీజుకైనా గ్రామసభ "నో అబ్జెక్షన్ సర్టిఫికేట్" ఇవ్వడానికి నిరాకరిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయవచ్చు. ఒకవేళ ఆ గ్రామం ఐదో షెడ్యూల్ (ఏజెన్సీ/గిరిజన) ప్రాంతం పరిధిలోకి వస్తే, 'పె సా చట్టం-1996' ప్రకారం అక్కడ ఎలాంటి మైనర్ ఖనిజాల (గ్రానైట్, ఇసుక వంటివి) లీజు ఇవ్వాలన్నా గ్రామసభ అనుమతి తప్పనిసరి. గ్రామసభ అనుమతి లేకుండా ఇచ్చే లీజులు చట్టవిరుద్ధం అవుతాయి. కాలుష్య నియంత్రణ మండలి మరియు మైనింగ్ చట్టాల ప్రకారం క్వారీలకు, నివాస ప్రాంతాలకు మధ్య కచ్చితమైన దూరం ఉండాలి. ఉదాహరణకు జాతీయ/రాష్ట్ర రహదారులు, నదులు, కాలువలు మరియు మానవ నివాసాలు (గ్రామాలు) ఉన్న ప్రాంతానికి కనీసం 500 మీటర్ల నుండి 1 కిలోమీటరు పరిధిలో ఎలాంటి భారీ పేలుళ్లు జరిపే క్వారీలకు అనుమతి ఇవ్వకూడదు. పురాతన కట్టడాలు మరియు పురావస్తు చట్టం ప్రకారం కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల రక్షిత కట్టడాల (ఉదాహరణకు ఎలగందుల కోట) చుట్టూ 100 నుండి 300 మీటర్ల పరిధిని 'నిషేధిత మరియు నియంత్రిత ప్రాంతం' గా గుర్తిస్తారు.



ఈ పరిధిలో మైనింగ్ పూర్తిగా నిషిద్ధం. దీనిని ఉల్లంఘిస్తే మైనింగ్ డిపార్ట్‌మెంట్‌పైనే క్రిమినల్ కేసులు పెట్టవచ్చు. ఐదు హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో జరిగే ఏ మైనింగ్ కైనా పర్యావరణ అనుమతి తప్పనిసరి. ఈ అనుమతి ఇచ్చే ముందు స్థానిక ప్రజలతో "ప్రజాభిప్రాయ సేకరణ" జరపాలి. ఒకవేళ ప్రజలు మెజారిటీగా వ్యతిరేకిస్తే, ఆ నివేదిక ఆధారంగా గ్రీన్ ట్రిబ్యునల్ సదరు లీజులను రద్దు చేస్తుంది. క్వారీల వల్ల గాలి, నీరు కలుషితమై ప్రజల జీవించే హక్కు దెబ్బతింటే, బాధితులు నేరుగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించి సదరు పరిశ్రమలపై 'క్లోజర్ ఆర్డర్స్' (మూసివేత ఉత్తర్వులు) సాధించవచ్చు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి కాలుష్య రహిత వాతావరణంలో స్వచ్ఛమైన గాలి, నీరు పొందే హక్కు ఉంది. గ్రానైట్ క్వారీల వల్ల సిలికోసిస్, ఆస్తమా వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నప్పుడు, గ్రామస్తులు తమ "జీవించే హక్కు"కు భంగం కలు గుతోందని చూపిస్తూ హైకోర్టు లేదా సుప్రీంకోర్టులలో రిట్ పిటిషన్ దాఖలు చేయవచ్చు. గతం లో కోర్టులు ఇలాంటి అనేక క్వారీలను శాశ్వతంగా నిషేధించాయి. గనులు మరియు ఖనిజాల (అభివఅద్ధి మరియు నియంత్రణ) చట్టంలోని సెక్షన్ 4-ఎ ప్రకారం.. పర్యావరణానికి తీవ్ర హాని కలిగించడం, ప్రజారోగ్యానికి ముప్పు తేవడం

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

లేదా చారిత్రక సంపదను ధ్వంసం చేయడం వంటి కారణాలు రుజువైతే, రాష్ట్ర ప్రభుత్వం సదరు మైనింగ్ కంపెనీ లీజును గడువు ముగియక ముందే శాశ్వతంగా రద్దు చేసే అధికారం కలిగి ఉంది. గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి చట్టపరమైన ఆధారాలతో (కాలుష్య నివేదికలు, పేలుళ్ల వల్ల ఇళ్లకు వచ్చిన పగుళ్ల ఫోటోలు) న్యాయస్థానాలను ఆశ్రయిస్తే మైనింగ్ కంపెనీలను గ్రామ సరిహద్దుల నుండి పూర్తిగా తరిమికొట్టే అవ కాశం ఉంది.

### గ్రామసభలపై తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్లు

గ్రామస్తులు మైనింగ్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, గ్రామసభలు ఈ కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడం వెనుక పెద్ద ఎత్తున రాజకీయ ఒత్తిళ్లు, చట్టపరమైన లసుగులు మరియు అవినీతి దాగి ఉన్నాయి. నిజానికి, చాలా సందర్భాలలో గ్రామసభలలోని సామాన్య ప్రజల అనుమతి లేకుండానే, కేవలం కాగితాలపై మాత్రమే అనుమతులు ఉన్నట్లు చూపిస్తున్నారు.గ్రానైట్ వ్యాపారులు స్థానిక సర్పంచ్ లేదా పంచాయతీ కార్యదర్శిలతో చేతులు కలిపి నకిలీ తీర్మాన పత్రాలను సఅష్టిస్తారు. గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఏదో ఒక సాధారణ సమావేశంలో తీసుకున్న సంతకాలను మైనింగ్ అనుమతుల కోసం వాడుకుంటారు. గ్రామంలోని కొందరు ముఖ్య నాయకులకు డబ్బు ఎరజూపి లేదా బెదిరించి గ్రామసభ జరిగినట్లు రికార్డులు సిద్ధం చేస్తారు.క్వారీ యజమానులు ఎక్కువగా అధికార పార్టీకి చెందిన మంత్రులు లేదా ఎమ్మెల్యేల అనుచరులు కావడంతో.. స్థానిక సర్పంచ్‌లు, వార్డు మెంబర్లపై తీవ్రమైన రాజకీయ ఒత్తిడి తీసుకువస్తారు. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే గ్రామానికి వచ్చే ప్రభుత్వ నిధులు ఆపేస్తామని లేదా అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తారు. కిందిస్థాయి రెవెన్యూ, మైనింగ్ అధికారులు కూడా వ్యాపారులకే మద్దతుగా నిలిచి, గ్రామసభలను తప్పుదోవ పట్టిస్తారు.మైనింగ్ కంపెనీలు ప్రారం భంలో గ్రామాన్ని దత్తత తీసుకుంటామని, సిమెంట్ రోడ్లు వేయిస్తామని, నిరుద్యోగ యువతకు ఉ ద్యోగాలు ఇస్తామని రంగుల కలలు చూపిస్తాయి. ఈ వాగ్దానాలను నమ్మి గ్రామసభలు మొద ట్లో అనుమతి ఇస్తాయి. కానీ, క్వారీ పనులు మొదలయ్యాక ఆ వాగ్దానాలను పూర్తిగా తుంగలో తొక్కుతాయి.నిధుల కొరతతో బాధపడే గ్రామ పంచాయతీలకు మైనింగ్ రాయల్టీ లేదా స్థానిక పన్నుల ద్వారా భారీగా ఆదాయం వస్తుందని ఆశ చూపిస్తారు. గ్రామాభివఅద్ధి కోసం నిధులు అవసరం కాబట్టి, పర్యావరణ నష్టాన్ని అంచనా వేయకుండా కొందరు ప్రజాప్రతినిధులు దీనికి అంగీకరిస్తారు. ఒకవేళ గ్రామసభ తీవ్రంగా వ్యతిరేకించి తీర్మానం చేసినప్పటికీ, మైనింగ్ శాఖలోని కొన్ని నిబంధనలను (గనులు జాతీయ/రాష్ట్ర సంపద అనే సాకుతో) ఉపయోగించుకుని, జిల్లా కలెక్టర్ లేదా మైనింగ్ డైరెక్టర్ (గ్రామసభ తీర్మానాన్ని పక్కనబెట్టి) లీజులను మంజూరు చేసే లసుగులు చట్టంలో ఉన్నాయి. ఈ కారణాల వల్లే ప్రజలు నరకం అనుభవిస్తున్నా, కాగితాల్లో మాత్రం గ్రామసభలు మైనింగ్‌కు "అనుమతి ఇచ్చినట్లు" రికార్డులు కనిపిస్తాయి.



# బాలాజీ నగర్ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో ఘనంగా బోనాల సంబరాలు.




కోదాడ, నేటిధాత్రి: బాలాజీ నగర్ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో బోనాల సంబరాలను అత్యంత వైభవంగా జరిపారు. వసతి గృహ వార్డెన్ పద్మ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. కళాశాల ప్రాంగణం అంత బోనాల పాటలు, డప్పు చప్పుళ్ళతో సందడిగా మారింది. వార్డెన్ పద్మ మాట్లాడుతూ.. మన సంస్కృతిని సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చైతన్య, స్థానిక ప్రజలు సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రావణ శోభ.. ఆడపడుచుల గాజుల సవ్వడి



నస్పూర్, నేటిధాత్రి: శ్రావణ శోభ ఆడపడుచుల గాజుల సవ్వడి.శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నస్పూర్ కాలనీలోని షిర్కేలో మహిళలు సంప్రదాయ పద్ధతుల్లో గాజుల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు.మహిళలంతా ఒకచోట చేరి గాజుల వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.గాజుల సవ్వడితో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భార్యాభర్తలు కలిసి వేదికలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.భర్త చేత భార్య బొట్టు పెట్టించుకుని, తమకు నచ్చిన గాజులను ఎంచుకుని ధరించారు.అనంతరం పెద్దల ఆశీర్వాదం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.మహిళలు సంప్రదాయ దుస్తుల ధరించి వేడుకకు హాజరుకావడంతో కార్యక్రమానికి మరింత శోభ చేకూరింది.పరస్పరం గాజులు పెట్టుకోవడంతో పాటు ఆత్మీయంగా పలకరించుకుంటూ సందడి చేశారు.చిన్నారులు, కుటుంబ సభ్యులు సైతం ఈ వేడుకలో పాల్గొని ఉత్సాహాన్ని పంచుకున్నారు.శ్రావణ మాసంలో మహిళలు కలిసి జరుపుకునే సంప్రదాయ వేడుకలను నిర్వహించడం ద్వారా కుటుంబ బంధాలు, మహిళల మధ్య ఆత్మీయత మరింత బలపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఆధునిక కాలంలోనూ మన సంస్కృతి,సంప్రదాయాలను కొనసాగిస్తూ భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుక నిర్వహించినట్లు పేర్కొన్నారు.గాజుల పండుగ సందర్భంగా మహిళల నవ్వులు, గాజుల సవ్వడితో షిర్కే ప్రాంతం సందడిగా మారింది.సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ నిర్వహించిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.



# ఆయిల్‌పామ్ రైతుల జిల్లా స్థాయి సమావేశం

**భూపాలపల్లి, నేటిధాత్రి:**

జిల్లా ఆయిల్‌పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పొల్నేని రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు.

మహదేవపూర్ మండలం అంబటిపల్లిలో శనివారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రైతుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 200 మందికి పైగా రైతులు హాజరయ్యారు. ఆతిథ్య రైతు లింగంపల్లి శ్రీనివాసరావుకు చెందిన 40 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగులో రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యలు, ఎరువుల కొరత, పంట సంరక్షణ, గెలల కోత, రవాణా, యంత్ర పరికరాల లభ్యత, ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలపై చర్చించారు. రైతులకు అవసరమైన యంత్రాలు, ఎరువులు, పంట సంరక్షణ ఉత్పత్తులు, నీటిపారుదల సాంకేతికతను అందించే సంస్థలను రైతులకు చేరువ చేయాలని నిర్ణయించారు.

## జిల్లా అధ్యక్షుడు పొల్నేని రాజేశ్వర్‌రావు...



ఈ సందర్భంగా పొల్నేని రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతుల సమస్యలను సమిష్టిగా పరిష్కరించేందుకు సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మండలం, గ్రామంలోని ఆయిల్‌పామ్ రైతులను సంఘంతో అనుసంధానం చేసి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రైతుల ఐక్యతే బలమని, అందరూ ఒకే వేదికపైకి వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సుదర్శన్‌రెడ్డి, పినపాక రాజారెడ్డి, పాల్వంచి రవీందర్, ఎర్రబెల్లి రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంబాడి అనిల్‌కుమార్, కార్యదర్శులు చిలకాని గోవర్ధన్, ఒడ్డాల తిరుపతి, నందికొండ పాపిరెడ్డి, బూనా మురళి, కంకణాల జనార్ధన్, కోశాధికారి గోలి కృష్ణారెడ్డి, మహిళా కార్యదర్శి బీరవోలు నిర్మలాదేవి, మీడియా, ప్రజా సంబంధాల ప్రతినిధి పొల్నేని వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షంలో తగ్గలే..అధికారంలో తగ్గేదేలే..

## పరకాలలో కాంగ్రెస్ సోషల్ మీడియా దూకుడు...



**పరకాల, నేటిధాత్రి:** పరకాల పట్టణంలో కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం దూకుడు పెంచుతోంది.ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ సోషల్ మీడియా విభాగం పార్టీ కార్యక్రమాలు,ప్రజా సమస్యలు,ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుగ్గా వ్యవహరించింది. ఎన్నికల సమయంలో పార్టీ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి విజయానికి కాంగ్రెస్ సోషల్ మీడియా కీలక పాత్ర పోషించిందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

**అధికారంలోకి వచ్చినా అదే దూకుడు....** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం





సోషల్ మీడియా ప్రచారంలోనూ అదే దూకుడును కొనసాగిస్తోంది. అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లోని దృశ్యాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను ఫొటోలు,వీడియోల రూపంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

పరకాల నియోజకవర్గంలో 400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.ఆయా పనుల వివరాలు,పురోగతిని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు.పని జరుగుతోంది ప్రజలకు కనిపించాలి అన్న రీతిలో కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రచారం సాగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సైతం విమర్శలకు అభివృద్ధి పనులతోనే సమాధానం ఇస్తామని చెబుతూ పరకాల అభివృద్ధిపైనే తమ ప్రధాన దృష్టి ఉందని పేర్కొంటున్నారు.మొత్తంగా ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పరకాలలో కాంగ్రెస్ సోషల్ మీడియా తన ప్రచార వేగాన్ని కొనసాగిస్తోంది.పార్టీ కార్యక్రమాలు,ఎమ్మెల్యే కార్యకలాపాలు,ప్రభుత్వ పథకాలు,అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కీలక వేదికగా మారింది.దీంతో పరకాల రాజకీయాల్లో కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారుతోంది.

**సోషల్ మీడియా ప్రజలకు వారధిగా..** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు,ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే మా లక్ష్యం.ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రజా సమస్యలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాం.ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా అదే వేగంతో ప్రజలకు తెలియజేస్తున్నాం.పరకాల నియోజకవర్గంలో జరుగుతున్న ప్రతి ముఖ్యమైన కార్యక్రమాన్ని ఫొటోలు,వీడియోల రూపంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.సోషల్ మీడియా ద్వారా ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నాం.

**గడ్డం శివ,టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పరకాల మండలం**

# సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో గౌడ హక్కుల సాధనకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- గీత కార్మికుల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం...
- 'మా జనాభా -- మా వాటా" కోసం మోకుదెబ్బ పోరాటం...
- మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సా గౌడ్...
- వరంగల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర కమిటీ సమావేశం....



**వరంగల్, నేటిధాత్రి:** సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో గౌడ హక్కుల సాధనకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టక తప్పదని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సా గౌడ్ అన్నారు.వరంగల్ జిల్లా కేంద్రంలోని పోచమ్మ మైదాన్ లోని వరంగల్ ఫంక్షన్ హాల్ లో మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన నర్సాగౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని గౌడ జన హక్కుల పోరాట సమితి--మోకుదెబ్బ దేశవ్యాప్తంగా గౌడ సమాజ హక్కులు, గీత కార్మికుల సంక్షేమం, సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన మరియు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం సంఘటిత ఉద్యమాన్ని నిర్మిస్తుందని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సా గౌడ్ తెలిపారు.మోకుదెబ్బ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాకుండా, ఆయన చూపిన స్వాభిమానం, సమానత్వం, అణగారిన వర్గాల ఐక్యత, ప్రజల సాధికారత అనే విలువలను నేటి ఉద్యమానికి ప్రాతిపదికగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.



**గీత కార్మికుల సమస్యలకు తక్షణ పరిష్కారం....** ఏజెన్సీ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న టిసిఎస్, టిఎఫ్టి లైసెన్సులను తక్షణమే మంజూరు చేయాలని అమరవేణి నర్సా గౌడ్ డిమాండ్ చేశారు.అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోపు లైసెన్సులు మంజూరు చేసే విధానం అమలు చేయాలని,సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు.50 సంవత్సరాలు నిండిన అర్హులైన గీత కార్మికులకు పెన్షన్, ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు తగిన ఎక్స్‌గ్రేషియా, బీమా, కుటుంబ పెన్షన్, గాయపడిన వారికి ఉచిత వైద్యం మరియు వికలాంగ పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.

**కల్లుగీత వృత్తికి ప్రభుత్వ రక్షణ కావాలి....** కల్లుగీత వృత్తి వేలాది కుటుంబాలకు జీవనాధారమని, ఈ వృత్తిని రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు.గీత కార్మికులకు ఆధునిక భద్రతా పరికరాలు, క్లైంబింగ్ కిట్లు, ఆరోగ్య బీమా అందించాలని, నీరా పరిశ్రమను అభివృద్ధి చేసి గౌడ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.తాటి, ఈత తదితర వనరులను అభివృద్ధి చేసి, గీత కార్మికుల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించే విధానాలను ప్రభుత్వం తీసుకురావాలని అన్నారు.

**"మా గౌడ జనాభా -- మా వాటా'....** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో "మా జనాభా -- మా వాటా" అనే నినాదాన్ని బహుజన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అమరవేణి నర్సా గౌడ్ పిలుపునిచ్చారు.విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక వనరులు మరియు నిర్ణయాధికారంలో గౌడలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు తదితర అణగారిన వర్గాలకు న్యాయమైన భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**33 జిల్లాల్లో మోకుదెబ్బను బలోపేతం చేయాలి...** తెలంగాణలోని 33 జిల్లాల్లో మోకుదెబ్బ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని జాతీయ అధ్యక్షులు పిలుపునిచ్చారు.ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు, మండల--జిల్లా కమిటీల క్రియాశీలత, జిల్లా ఇన్‌చార్జిల ద్వారా నిరంతర పర్యవేక్షణ, నెలవారీ సమీక్షలు, జిల్లా సమస్యలపై రాష్ట్ర కమిటీకి నివేదికలు అందించే విధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

**ప్రతి సమస్యపై ఉద్యమ కార్యాచరణ..** ప్రతి సమస్యకు డిమాండ్ -- బాధ్యత -- గడువు -- కార్యాచరణ అనే విధానంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు.ముందుగా అధికారులకు వినతిపత్రాలు, ప్రజా ప్రతినిధులతో చర్చలు, జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించి, సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్రస్థాయిలో శాంతియుత, ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ ఉద్యమాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.పాపన్న ఆశయమే మోకుదెబ్బ లక్ష్యం."పాపన్న మహారాజ్‌కు జై కొట్టడం మాత్రమే కాదు --- ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి."“స్వాభిమానం కోసం పాపన్న పోరాడాడు --- హక్కుల కోసం మోకుదెబ్బ పోరాడుతుంది అని నర్సాగౌడ్ తెలిపారు.గౌడ సమాజం మరియు బహుజన వర్గాలు ఐక్యంగా నిలబడి తమ హక్కులను సాధించుకోవాలని, యువత ఉద్యమంలో కీలక పాత్ర పోషించాలని అమరవేణి నర్సా గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్దిరాములు గౌడ్, జాతీయ నాయకులు దోమ్మటి రమేష్ గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజు గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి, హైకోర్టు అడ్వకేట్ బాలసాని సురేష్ గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ముత్యం నర్సన్న గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జువ్వాజీ అనిల్ గౌడ్, జాతీయ ప్రచార కార్యదర్శి గుల్లపల్లి ఉమేందర్ గౌడ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శులు గొడిశాల సదానందం గౌడ్, మార్క శంకర్ గౌడ్,రాష్ట్ర అధికార ప్రతినిధి బుచ్చంగారి కిషన్ గౌడ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోశాల వెంకన్న గౌడ్, రాష్ట్ర కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కందుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు వెన్నెల రవి గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకన్న గౌడ్, మహబూబాబాద్



జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్,హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తోటకూరి రాందాస్ గౌడ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పచమల్ల స్వామి గౌడ్,నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్ గౌడ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నాగభూషణ్ గౌడ్ , రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చీరమల్ల పరుశురామ్ గౌడ్, రాష్ట్ర నాయకులు మచ్చిక రాజు గౌడ్, వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్స్ బూర హేమచంద్ గౌడ్, పంజాల వెంకట్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల దేవేందర్ గౌడ్ వివిధ జిల్లాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# కళారంగంలో విశేష ప్రతిభ చాటుతున్న మండల వీరస్వామి గౌడ్

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా కళా ప్రదర్శనలు...
- కవి, గాయకుడు, భక్తి గేయాల రచయితగా ప్రత్యేక గుర్తింపు....



**నర్సంపేట, నేటిధాత్రి:** తెలుగు సాహిత్యం, సంగీతం, కళారంగాల్లో తనదైన ప్రతిభతో రాణిస్తూ నర్సంపేటకు చెందిన మండల వీరస్వామి గౌడ్ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. కవిగా, గాయకుడిగా, భక్తి గేయాల రచయితగా తన ప్రతిభను చాటుకుంటూ తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.నర్సంపేట అయ్యప్ప దేవాలయ భజన మండలిలో గాయకుడిగా కొనసాగుతున్న మండల వీరస్వామి గౌడ్ భక్తి గేయాలు, ఆధ్యాత్మిక పాటలు ఆలపించడంతో పాటు స్వయంగా భక్తి గేయాలను రచిస్తూ సంగీత, సాహిత్య రంగాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటున్నారు. తన గాత్రంతో భక్తులను ఆకట్టుకోవడంతో పాటు కవితా గానం ద్వారా సాహిత్యాభిమానులను అలరిస్తున్నారు.



**కళలపై చిన్ననాటి నుంచే ఆసక్తి....** మండల వీరస్వామి గౌడ్‌కు చిన్ననాటి నుంచే కళలు, సాహిత్యం, సంగీతంపై ఆసక్తి ఉన్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలతో పాటు కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ తన ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు. భక్తి గేయాలు, సామాజిక అంశాలు, మానవతా విలువలు, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కవితలు, గేయాలను రచించడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది.తెలుగు భాషపై ఉన్న అభిమానంతో సాహిత్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ యువతలో సాహిత్యంపై ఆసక్తి పెంపొందించేందుకు కూడా కృషి చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుకుంటూ కళాకారుడిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.



**విజయవాడ కవి సమ్మేళనంలో ప్రతిభ...** ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో మండల వీరస్వామి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కవితలను, కవితా గానాన్ని వినిపించి సభికులను ఆకట్టుకున్నారు. ఆయన కవితా గానం, కళాప్రతిభకు కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, ప్రముఖ భాషా పరిశోధకుడు గిడుగు రామమూర్తి పంతులు మునిమనవడు గిడుగు వెంకట నాగేశ్వరరావు,చిన్న నారాయణరావు, మల్లెతీగ సంస్థ అధినేత కలిమిశ్రీ తదితరుల చేతుల మీదుగా మండల వీరస్వామి గౌడ్‌ను ఘనంగా సత్కరించారు.శాలువ కప్పి, జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి ఆయన కళా ప్రతిభను కొనియాడారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ తెలుగు భాష, సాహిత్యం, సంగీతం, కళలకు సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.





**అవార్డులు, సత్కారాలతో ప్రోత్సాహం..** కళారంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన పలు సంస్థలు, సాహితీ, సాంస్కృతిక సంఘాలు మండల వీరస్వామి గౌడ్‌ను ఇప్పటికే పలు సందర్భాల్లో సత్కరించి, అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశాయి. ప్రతి సత్కారం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని, కళారంగంలో మరింత కృషి చేయడానికి ప్రేరణగా నిలుస్తోందని వీరస్వామి గౌడ్ పేర్కొన్నారు.తెలుగు సాహిత్యం, సంగీతం, భక్తి గేయాల రంగాల్లో మరింతగా కృషి చేసి భవిష్యత్ తరాలకు తెలుగు కళలు, సంస్కృతి, సంప్రదాయాలను చేరువ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.మండల వీరస్వామి గౌడ్‌కు లభిస్తున్న గుర్తింపు పట్ల నర్సంపేటకు చెందిన సాహితీ, సాంస్కృతిక అభిమానులు, అయ్యప్ప భజన మండలి సభ్యులు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# ఎమ్మార్పీఎస్ గొర్లవేడు గ్రామ కమిటీ ఎన్నిక



**భూపాలపల్లి, నేటిధాత్రి:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు భూపాలపల్లి రూరల్ మండలం కో ఇన్చార్జి చంటి మాదిగ ఆధ్వర్యంలో గొర్లవీడు గ్రామంలో నూతన గ్రామ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఇన్చార్జులు దోర్నాల రాజేందర్ మెరుపటి అశోక్ మాదిగలు హాజరైనారు అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జిలు అంబాల చంద్రమౌళి మాదిగ శ్యామ్ మాదిగ ఆదేశాల మేరకే మండలంలోని అన్ని గ్రామాలలో నూతన గ్రామ కమిటీలను వేయడం జరుగుతుందని వారు అన్నారు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేసి ఏబీసీలు వర్గీకరణ సాధించడం జరిగిందని వారు తెలిపారు వారి ఆశయాలకు అనుకూలంగా కార్యకర్తలు పని చేయాలని వారు పిలుపునిచ్చారు అనంతరం గొర్లవేడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గాజుల సిద్ధార్థ అధికార ప్రతినిధి దొడ్డి చందు ప్రధాన కార్యదర్శి అశోకు మంద రాజేందర్ ఉపాధ్యక్షుడు మాట్ల అజయ్ మంద రాజు దేవేందర్ రవితేజ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు వారు తెలిపారు

# కోతులు, వీధి కుక్కల బెడదపై ప్రజావాణిలో ఫిర్యాదు.

**చిట్యాల, నేటిదాత్రి:**

చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలో కోతులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ మండల ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించారు.మండల కేంద్రంలోని పలు కాలనీలు, ప్రధాన వీధులు, నివాస ప్రాంతాల్లో కోతులు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి ప్రవేశించడం, ఆహార పదార్థాలను తీసుకెళ్లడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లే సమయంలో కోతుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అదేవిధంగా వీధి కుక్కల సంఖ్య కూడా అధికంగా ఉండటంతో రోడ్లపై ప్రయాణించే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కుక్కలు గుంపులుగా తిరుగుతూ





వాహనదారులను వెంబడించడం, ప్రజలను భయపెట్టడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని పేర్కొన్నారు.కోతులు, వీధి కుక్కల బెడద కారణంగా ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజావాణిలో అధికారులను కోరారు.ఈ కార్యక్రమం లో గుర్రపు శ్రీధర్, దేవరకొండ సత్యనారాయణ,చరపల్లి వెంకటేశ్వర్లు ,చైతన్య గుప్త తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వే వేగవంతం చేయాలని ప్రజావాణిలో వినతిపత్రం

**సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్...**



**భూపాలపల్లి, నేటిధాత్రి:** టేకుమట్ల మండల కేంద్రంలో ఎమ్మార్వోఖానలో భూ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో వసంత రావ్ ఎమ్మార్వో స్వరూప రాణి కి సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రీ భూముల సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినది కానీ ఇప్పటివరకు సాగు బై నామాలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పటివరకు ఒక్కరికి కూడా పట్టాలు వచ్చిన దాఖలాలు లేదు దళితులు గత 50 సంవత్సరాలుగా సాగులో ఉన్న ఇప్పటివరకు పట్టాలు ఇచ్చిన పరిస్థితి లేదు రాష్ట్ర ప్రభుత్వం మాటలకే పరిమితమైనది చేతల్లో విఫలమైందని వారు అన్నారు మండలానికి సర్వే చేసేఅధికారులను కేటాయించినప్పటికీ ఇప్పటివరకు అధికారులు పనిలో లేకపోవడం సర్వే మాత్రం నామ మాత్రంగా జరుగుతోంది జిల్లా కలెక్టర్ ఆఫీస్ లను సందర్శించి సర్వేలనువేగవంతం చేసే సన్న చిన్న కారు రైతుల దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అంబాల అశ్వద్ధామ పాల్గొన్నారు

# ఏఎన్‌సీ లక్ష్యాల పేరుతో ఆశా వర్కర్లపై ఒత్తిడి తగ్గించాలి



**నర్సంపేట, నేటిధాత్రి:** ఆశా వర్కర్లకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పారితోషికాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ కోఠిలోని వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్‌కు యూనియన్ నాయకులు నోటీసు అందజేశారు. అనంతరం గోనె యువరాజు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువల లలిత మాట్లాడుతూ.. ఆశా వర్కర్లపై ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అనవసరమైన పనుల భారం మోపుతున్నారని ఆరోపించారు. పారితోషికం లేని సర్వేలు, ఎఎన్‌సీ లక్ష్యాలు, పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో సహాయక నర్సు-మిడ్‌వైఫ్‌లు నిర్వహించాల్సిన విధులను సైతం ఆశా వర్కర్లతో చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు నిర్దేశించిన విధులకు భిన్నంగా అదనపు పనులు అప్పగించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పల్స్‌పోలియో, కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలకు సంబంధించిన పారితోషికాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని కోఠిలో నిర్వహించే ధర్నాలో వరంగల్ జిల్లాకు చెందిన ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోలి సంధ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు అనిత, జిల్లా సహాయ కార్యదర్శి సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షులు నిషిధర్

**భూపాలపల్లి జిల్లాలో 22(ఎ) భూముల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలి...**



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలు, అక్రమ చేర్పులపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడు నూనెల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. చందుపట్ల కీర్తి రెడ్డి హాజరైనారు.ఈ సందర్భంగా చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లాలో 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలు, అక్రమ చేర్పుల వల్ల అనేక మంది రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏళ్ల తరబడి తమ భూములపై హక్కులు ఉన్నప్పటికీ 22(ఎ) జాబితాలో చేర్చడం వల్ల వాటిని విక్రయించలేక, అభివృద్ధి చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 22(ఎ) జాబితాలో జరిగిన చేర్పులు, తొలగింపులపై సమగ్ర విచారణ జరిపి, గ్రామం, మండలం, సర్వే నంబర్ వారీగా పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరణి, భూ భారతి తదితర డిజిటల్ భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని కోరారు.అర్హత లేని భూములను 22(ఎ) జాబితాలో చేర్చినట్లయితే వాటిని వెంటనే గుర్తించి తొలగించాలని, బాధిత రైతులకు న్యాయం చేయాలని కీర్తి రెడ్డి డిమాండ్ చేశారు. భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు.22(ఎ) భూముల వ్యవహారంలో అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల భూములపై ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, భూ హక్కులను కాపాడాలని కోరారు.భూపాలపల్లి జిల్లాలోని 22(ఎ) భూముల పూర్తి జాబితాను బహిర్గతం చేయాలి.గ్రామం--మండలం--సర్వే నంబర్ వారీగా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. 22(ఎ)లో జరిగిన చేర్పులు, తొలగింపులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలి.డిజిటల్ భూ రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలి.తప్పుగా చేర్చిన భూములను గుర్తించి వెంటనే తొలగించాలి.బాధిత రైతులకు, భూ యజమానులకు న్యాయం చేయాలి.అక్రమాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. 22(ఎ) వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపించాలి. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు నాగో ర్పూ కౌన్సిలర్ కన్నం యుగంధర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు జన్నే మొగిలి ఎరుకల గణపతి జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్ తాడిచెర్ల రవి కిరణ్ పెండ్యాల రాజు రాష్ట్ర జిల్లా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్ట్ నుంచి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఏశమేని గణేష్‌కు ఘన సన్మానం



**మెట్‌పల్లి, నేటిధాత్రి:** ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన ఏశమేని గణేష్‌ను మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డా. బూరం సంజీవ్, కార్యదర్శి మహమ్మద్ అజీమ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.తోటి జర్నలిస్ట్‌గా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చిన ఏశమేని గణేష్ ఇప్పుడు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని డా. బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్ అన్నారు. జర్నలిజం రంగంలో పనిచేస్తూనే కార్మికుల సమస్యలపై అవగాహన కలిగి ఉండటం, వారి హక్కుల కోసం పోరాడే బాధ్యతను స్వీకరించడం అభినందనీయమన్నారు.జిల్లా అధ్యక్షుడిగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో మరిన్ని ఉన్నత అవకాశాలు లభించాలని, తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు ఏశమేని గణేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బొబ్బిల్లి హరీష్, గౌరవ సలహాదారులు దాసరి కిషన్ ,ట్రెషరర్ మహ్మద్, జాయింట్ సెక్రెటరీ ఫుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆర్ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఎండి అఖిల్, శక కుమారు, అమ్ముల ప్రవీణ్ , అప్పం చిన్నారెడ్డి, ఆజ్మీర గంగాధర్, రమేష్ నాయక్ తెలుకంటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపో అధికారుల నిర్లక్ష్యం

**యూత్ కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి పవన్ కళ్యాణ్**



**గుండాల, నేటిధాత్రి:** ఆర్టీసీ బస్సు డిపో కంట్రోలర్లు మరియు అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుండాల మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొబ్బిలి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సమయానికి బస్సులు నడపకపోవడం ప్రయాణికులు అడిగే ప్రశ్నలకు డిపో కంట్రోల్ రూమ్ సిబ్బంది బాధ్యతారహితంగా సమాధానాలు చెప్పడం లేదు అసలు స్పందించకపోవడం దారుణమని ఆయన మండిపడ్డారు.సమయపాలన పాటించాలి గ్రామీణ ప్రాంతాలకు మరియు ప్రధాన రూట్లలో రవాణా సౌకర్యాలు లేకుండా బస్సుల వేళలను కచ్చితంగా అమలు చేయాలన్నారు.కంట్రోలర్ల తీరు మారాలి డిపో కంట్రోల్ రూమ్ సిబ్బంది ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, సమాచారం సరిగ్గా అందించాలన్నారు.అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే శాఖాపరమైన చర్యలు చేపట్టాలి.ప్రజా సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించకపోతే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# చేనేత చౌక్ వద్ద బీఆర్ఎస్వీ నిరసన



**మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం.. విద్యార్థులు పస్తులు...**

**బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్...**

**సీఎం ఇలాకాలోనే పాలన విఫలం...**

**సిరిసిల్ల, నేటిధాత్రి:** విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. భోజనంలో పురుగులు రావడంపై ప్రశ్నించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం బెదిరించడం బాధాకరమన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు విద్యార్థులను భయపెట్టడం సరికాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేని పరిస్థితి ఉంటే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. భోజన పథకంలో నిర్లక్ష్యానికి కారణమైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను బెదిరించడం వెంటనే ఆపాలని కోరారు. "ఇదేనా ప్రజా పాలన.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?" అని కంచర్ల రవి గౌడ్ ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మట్టి శ్రీనివాస్, బక్కని వేణు యాదవ్, హర్షిత్, స్వాతిక్, విష్ణు, వినయ్, రిషిత్, అభి, సిద్ధార్థ, సాయి, నవీన్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంతు రవిదాస్ ఆశయాలను కొనసాగించాలి



**బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశీదర్ రెడ్డి...**

**భూపాలపల్లి, నేటిధాత్రి:** సంత్ రవిదాస్ 15వ శతాబ్దపు గొప్ప భక్తి ఉద్యమ కవి, ఆధ్యాత్మిక గురువు సామాజిక సంస్కర్త. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి సమీపంలోని సీర్ గోవర్ధనపురంలో జన్మించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, మానవ సమానత్వాన్ని చాటిన మహనీయుడు సంతు రవిదాసు ఒక చెప్పులు కుట్టుకునే సాధారణ వ్యక్తి నుండి దేశ ప్రజలు అందరు హిందువులు సమానమే హిందు తత్వం గురించి ప్రచారం చేసిన గొప్ప గురువు సంతు రవిదాసి వారి ఆశయాలను కొనసాగించాలని జిల్లా అధ్యక్షులు నిశీదర్ రెడ్డి అన్నారు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బిజెపి పార్టీ కార్యాలయంలో సంత్ రవిదాస్ మహారాజ్ యొక్క 600 సంవత్సరాల జయంతిని పురస్కరించుకొని, వారి యొక్క జన్మస్థలం నుంచి తీసుకొచ్చినటువంటి పవిత్రమైన మట్టి కలశం బిజెపి పార్టీ కార్యాలయంలో ఉంచడం జరిగింది. వారు తెలిపారు ఈ పవిత్రమైన వారి యొక్క జన్మభూమి మట్టిని భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాలకు, అన్ని వర్గాల ప్రజలు, కుల పెద్దలు, ఆ తర్వాత ప్రతి ఒక్కరి దగ్గరికి తీసుకువెళ్లి, వారి చేతులపైన పూజ చేయించి, తిరిగి వారి జన్మస్థలమైనటువంటి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసికి పంపించడం జరుగుతుంది. వారు తెలిపారు బిజెపి పార్టీ దేశమంతా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం జరుగుతుందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్ జగదీశ్వర్ పట్టణ అధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి



**దుగ్గొండి, నేటిధాత్రి:** దుగ్గొండి మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో చల్లా రాజు (38) అనే యువ రైతు మృతి చెందాడు. స్థానిక ఎస్సై రావుల రణధీర్ రెడ్డి వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద మోటార్ ఆన్ చేస్తుండగా రాజుకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి తెలిపారు. శవ పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

# రాయపాడులో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరం



**ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహణ...**

**ఆళ్లపల్లి, నేటిధాత్రి:** మండల పరిధిలోని రాయపాడు గ్రామ పంచాయతీలో పాల్వంచ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు వైద్య సిబ్బంది ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలు, సూచనలు అందించారు. పరీక్షల అనంతరం మొత్తం 15 మందికి శస్త్రచికిత్సలు (ఆపరేషన్లు) అవసరమని గుర్తించగా, మరో 12 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించేందుకు ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందించిన పాల్వంచ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెండికట్ల రాజేందర్, కోసం నాగేష్, మాజీ ఎంపీపీ పెండేకట్ల పాపారావుతో పాటు స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు వి.కె. ఎర్రయ్య, వి.కె. శీను, వి.కె. విశ్వనాథం, గుమ్మడి బుచ్చయ్య, వసంతరావు, పెండేకట్ల ఎర్రయ్య, ఊరికి నాగేశ్వరరావు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పీఎస్ 10వ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక



**నస్పూర్, నేటిధాత్రి:** మాదిగల హక్కులు,సామాజిక న్యాయం సాధన కోసం చేపట్టే భవిష్యత్ ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) 10వ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లో సోమవారం నస్పూర్ మండల ఇన్‌చార్జీలు గద్దల బానయ్య, బచ్చుల రమేష్, గుంపుల స్వామి,కొయ్యల శేఖర్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ సమాజానికి రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన హక్కుల సాధన కోసం ఎంఆర్‌పీఎస్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. డివిజన్ స్థాయిలో కమిటీని పటిష్టం చేసి ప్రజలను,యువతను ఉద్యమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. సమాజంలో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, మాదిగల అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కొయ్యల జీవన్, ప్రధాన కార్యదర్శిగా ఎక్కటూరి సన్నీ,ఉపాధ్యక్షులుగా గుడిసెల ప్రవీణ్‌కుమార్,ఇదునూరి శరత్‌లను ఏకగ్రీవంగా నియమించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అభినందించారు. తమపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు నక్క అంజన్న,ఇరికిల్ల పురుషోత్తం, మాడుగుల రాజం,కొయ్యల వెంకటి,ఇరికిల్ల లింగయ్య, ఎక్కటూరి రాయలింగు,ఇరికిల్ల స్వామి,బచ్చల తిరుపతి, కొయ్యల భూమయ్య,ఇరికిల్ల శ్రీకాంత్,మాడుగుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా నడుస్తున్న గ్లోబల్ మైండ్ పాఠశాలను సీజ్ చేయాలి.

**పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా....**



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని అనుమతులు లేకుండా గ్లోబల్ మైండ్ పేరుమీద పాఠశాల నడిపిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ఆ పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, బిఆర్ఎస్వి విద్యార్థి సంఘ నాయకులు పాఠశాల ఎదుట ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాతుకు.ప్రవీణ్ కుమార్, బిఆర్ఎస్వి జిల్లా ఇంచార్జ్ కోలోజు దిలీప్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులను జిల్లా విద్యాశాఖ అధికారులను మోసం చేస్తూ గుర్తింపు పొందిన పాఠశాల పేరు కాకుండా హైదరాబాద్ కు చెందిన గ్లోబల్ మైండ్ పాఠశాల పేరు పెట్టి పాఠశాల నడిపించడం నిబంధనలకు విరుద్ధమని వారన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ కు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందుల గురిచేస్తుందని తెలిపారు. రెండు రోజుల క్రితం యాజమాన్యం జీతాలు ఇవ్వటం లేదని టీచర్లు, అయమ్మలు పాఠశాలకు తాళం వేసి, తరగతులు నిర్వహించకుండా నిరసన తెలిపారని అన్నారు. తరచూ విద్యార్థులకు పాఠశాల బంద్ కావడం వల్ల తరగతులు మిస్ అవుతున్నారని, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. విద్యార్థి సంఘాల ఆందోళనకు దిగివచ్చిన విద్యాశాఖ అధికారులు వెంటనే ఆ స్కూలుకు సంబంధించిన పాఠశాల పేరు కాకుండా గ్లోబల్ మైండ్ పాఠశాల పేరు మీద ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. స్కూల్ వ్యాన్ మీద పేర్లను తొలగించాలని అనుమతి ఉన్న పాఠశాల పేరును కాకుండా ఇతర పాఠశాల పేరు పెట్టుకొని నడిపిస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి దేవా నాయక్ తెలిపారు. పాఠశాల ఎదుట ఆందోళనకు దిగిన విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, బిఆర్ఎస్వి జిల్లా నాయకులు పంగ మహేందర్, ఆకినపెల్లి శివ, భూక్య హరీష్, మహేశ్వర్, గుడి కందుల లక్ష్మణ్, కొమ్ము హరీష్, తిరుపతి, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హడావుడిగా ఆసుపత్రి ప్రారంభం.. తెరుచుకోని హాస్పిటల్

**బీజేపీ నేత డాక్టర్ కాళీప్రసాద్‌రావు...**



**పరకాల, నేటిధాత్రి:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పరకాల బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, ఎన్ఐఆర్ హనుమకొండ జిల్లా ప్రముఖ్ రావు అమరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నిరంగి సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ పరకాల ప్రభుత్వ ఆసుపత్రిని హడావుడిగా ప్రారంభించారని, ప్రస్తుతం అది మూతపడే పరిస్థితిలో ఉందని ఆరోపించారు. ఆసుపత్రి పరిస్థితిపై ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పరకాల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని కోరారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు పరకాల బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. బకాయిలు చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పి. జయంతిలాల్,దేవునూరి మేఘనాథ్,కౌన్సిలర్లు బెజ్జంకి పునాచారి,ఆకుల లావణ్య శ్రీధర్,మండల అధ్యక్షులు కాసగాని రాజ్‌కుమార్,ఉప్పుగల శ్రీకాంత్‌రెడ్డి,వేల్పుల రాజ్‌కుమార్,పరకాల మాజీ చైర్‌పర్సన్ మార్త రాజభద్రయ్య, నాగారం మాజీ సర్పంచ్ బాబన్న, ఓబీసీ జిల్లా అధికార ప్రతినిధి ఉడత చిరంజీవి,ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కలపల్లి కిరణ్,పరకాల పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్,దంచనాదుల సత్యనారాయణ, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు పైండ్ల రంజిత్, ప్రధాన కార్యదర్శి గుడిగంటి రఘుపతి గౌడ్, ఓబీసీ మాజీ ఉపాధ్యక్షుడు బాసాని సోమరాజు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మామునూరు శ్రీనివాస్, ఆత్మకూరు మాజీ అధ్యక్షుడు ఇరుసాల సదానందం, సోషల్ మీడియా కన్వీనర్ మెంతుల సురేష్,మండల ప్రధాన కార్యదర్శులు దంచనాదుల కిరణ్, రవ్వ శివప్రసాద్,సూరచందర్,గుండు ముఖేష్, గుండెబోయిన నరసయ్య,జంగిలి రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యార్థులకు సరైన సమయంలో బస్సులు నడపాలి.



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం లో కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు సరైన సమయంలో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తమ తమ క్లాసులకు లేటుగా వెళుతున్నారని బస్సులు సమయపాలన పాటించలేకపోవడంతో కేంద్రీయ విద్యాలయంలో చదువుకునే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు వారి తల్లిదండ్రులు. తమ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి. చేరుకొని తమ పిల్లలు పడుతున్న బాధలను కలెక్టర్ పరిష్కరించాలనిఅలాగే కేంద్రీయ విద్యాలయానికి వెళ్లే దారిలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో భయంతో ఉన్నారు. చుట్టుపక్కల పరిసరాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని. సకాలంలో విద్యాలయానికి చేరుకోకపోవడంతో . తరగతులకు క్లాసులకు ఆలస్యమవుతుందని. అలాగే తమ పిల్లలు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని. వెంటనే కలెక్టర్ స్పందించి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు ఇబ్బందులుకలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు

# ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా బొచ్చు ఈశ్వర్,కార్యదర్శిగా కోగిల సాయితేజ**




**పరకాల, నేటిధాత్రి:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ పిలుపునిచ్చారు. సోమవారం పరకాల మండల ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ పరకాల మండలంలో విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించే వరకు ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. పరకాల పట్టణంలోని విద్యారంగ సమస్యల పరిష్కారానికి నాయకులు,కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల అధ్యక్షుడిగా బొచ్చు ఈశ్వర్,కార్యదర్శిగా కోగిల సాయి తేజ, ఉపాధ్యక్షుడిగా రాహుల్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్,పట్టణ సహాయ కార్యదర్శి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 12 అర్జీలు



పరకాల, నేటిధాత్రి: పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల డివిజన్,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి మొత్తం 12 అర్జీలు స్వీకరించారు. అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశించారు.

# వివాహాల నమోదు చట్టంపై అవగాహన



నర్సంపేట, నేటిధాత్రి: నర్సంపేట పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో "వివాహ తప్పనిసరి నమోదు చట్టం--2002"పై రూపొందించిన వాల్ పోస్టర్‌ను సబ్‌రిజిస్ట్రార్ గిరిధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ గిరిధర్ మాట్లాడుతూ వివాహాన్ని నమోదు చేసుకోవడం ద్వారా దంపతులకు చట్టబద్ధత లభించడంతో పాటు అనేక న్యాయపరమైన ప్రయోజనాలు పొందవచ్చన్నారు. వివాహ నమోదు ద్వారా బాల్య వివాహాలు, బహుభార్యత్వాన్ని అరికట్టవచ్చని తెలిపారు. ప్రేమ పేరుతో జరిగే మోసాలు, రహస్య వివాహాలు, రుజువులేని పెళ్లిళ్లను అడ్డుకోవడంలో వివాహ ధ్రువీకరణ పత్రం కీలక ఆధారంగా ఉపయోగపడుతుందన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంతో పాటు విడాకులు, భర్త నుంచి విడిపోయిన లేదా దూరంగా ఉన్న మహిళలు భరణం పొందేందుకు ఈ పత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. వివాహానికి సంబంధించిన వివిధ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కూడా నమోదు పత్రం దోహదపడుతుందన్నారు. వివాహ నమోదు కోసం దరఖాస్తుతో పాటు శుభలేఖ, దంపతుల జనన, నివాస ధ్రువీకరణ పత్రాలు, వివాహానికి సంబంధించిన ఫోటోలు, ఇరువురి తరఫున సాక్షుల సంతకాలు జత చేయాలని సూచించారు. "మీ వివాహానికి చట్టబద్ధత కల్పించండి--న్యాయపరమైన ప్రయోజనాలు పొందండి" అని ఆయన పిలుపునిచ్చారు.స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ తప్పనిసరి వివాహ నమోదు ద్వారా బాల్య వివాహాలను రూపుమాపవచ్చన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించి బాల్య వివాహాన్ని నిరోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి, సోషల్ వాలంటీర్ కాసుల వెంకటాచారి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు పున్నం చందర్, హబీబ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 97ను ఉపసంహరించాలి



**పాలిటెక్నిక్ విద్యార్థులతో ఏబీవీపీ మహాధర్నా...**

పరకాల, నేటిధాత్రి: పాలిటెక్నిక్ విద్యను ప్రభావితం చేసే జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పరకాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పరకాల కార్యదర్శి బాల్సుకూరి కార్తీక్ మాట్లాడుతూ పారిశ్రామిక శిక్షణా సంస్థలు,అధునాతన సాంకేతిక కేంద్రాలు,పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు,అధ్యాపకులతో సంప్రదింపులు లేకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్య విధానంలో కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు,అధ్యాపకుల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆగస్టు 25న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు ఆకుతోట భానువరప్రసాద్,భాషబోయిన జస్వంత్, భరణి, గౌతమ్,అభి, అజయ్, విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై రాజకీయ ఫోటోలు వద్దు




నర్సంపేట, నేటిధాత్రి: నర్సంపేట పట్టణ పరిధిలోని పలు రేషన్ షాపుల వద్ద సోమవారం అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో పాటు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డును అందుకున్న లబ్ధిదారులు నాడెం రామకృష్ణ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా నిరుపేదలకు రేషన్ సరుకులు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేశారు. అయితే కార్డుల రూపకల్పనపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ రేషన్ కార్డులపై ముద్రించిన ఫోటోల కారణంగా పాత కార్డులను రద్దు చేసి కొత్త కార్డులను ముద్రించడం జరుగుతుంటుందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు ప్రజలకు కూడా అసౌకర్యం కలుగుతోందని పేర్కొన్నారు.అందువల్ల భవిష్యత్తులో రాజకీయాలకు అతీతంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మార్చాల్సిన అవసరం లేకుండా రేషన్ కార్డులపై ఎలాంటి రాజకీయ నాయకుల లేదా ఇతరుల ఫోటోలు లేకుండా కేవలం అధికారిక వివరాలతోనే కార్డులను ముద్రించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలా చేస్తే కార్డులు దీర్ఘకాలం వినియోగించేలా ఉండటంతో ప్రభుత్వ ధనం ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు రాజు, యుగేందర్, రాజేందర్, చింతల క్రాంతి, సామల రాజుతో పాటు పౌరసరఫరాల శాఖ సిబ్బంది, ఇతర లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

**▶▶సెప్టెంబర్ చివరి వారంలోగా 100 శాతం లక్ష్య సాధనకు చర్యలు...**

**▶▶రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ...**



మంచిర్యాల, నేటిధాత్రి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం--2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి వినయ్‌కుమార్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్యమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం వన



మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను కూడా అధికారులు సమన్వయంతో పనిచేసి సెప్టెంబర్ చివరి వారంలోగా వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకోలేకపోయామని,ఇకపై కురిసే వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. అటవీ శాఖ నర్సరీల్లో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని, గుర్తించిన ప్రాంతాలకు అనువైన మొక్కలను ఎంపిక చేసి నాటాలని తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలని,పశువులు, జంతువుల నుంచి రక్షించేందుకు అవసరమైన ప్రాంతాల్లో చెట్ల రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణ అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. జిల్లాలో 27 లక్షల మొక్కలు నాటాం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో వన మహోత్సవం--2026లో భాగంగా 41 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 27 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అమరవేణి నర్సాగౌడ్



హైదరాబాద్, నేటిధాత్రి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ బీసీ ఉద్యమ నాయకుడు అమరవేణి నర్సాగౌడ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అమరవేణి నర్సాగౌడ్ గత 30 ఏళ్లుగా విద్యార్థి నాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, వివిధ ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొని ఉద్యమ నాయకుడిగా ఎదిగారని, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పలు పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. బీసీ కులాల ఐక్యత కోసం నర్సాగౌడ్ చేస్తున్న కృషిని గుర్తించి ఆయనను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నూతన రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు బీసీ కులాలను ఐక్యం చేసి, బీసీలకు రాజ్యాధికారం దక్కేలా ఐక్య ఉద్యమాన్ని నిర్మించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు అనుముల భాస్కర్, మోకుదెబ్బ జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...**



మంచిర్యాల, నేటిధాత్రి: ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని,ఈ క్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ వారు కార్యక్రమం నిర్వహణకు ముందుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం,ఏకాగ్రత, విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 23.75 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

**▶▶రేపు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించాలి...**

**▶▶రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ...**

**▶▶అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష...**

**▶▶హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



సిరిసిల్ల, నేటిధాత్రి: వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంపై మంత్రి కొండా సురేఖ అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన వాటి స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైనవి సకాలంలో తరలించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు.

**▶▶జిల్లాలో ఏర్పాట్లు చేయండి...** వన మహోత్సవం కింద జిల్లాలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా మొత్తం లక్ష్యం 8, 65, 200 కాగా, 6,89, 212 మొక్కలు నాటి.. 79.66 శాతం లక్ష్యం పూర్తి చేశామని వెల్లడించారు. అటవీ శాఖ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు నాటే లక్ష్యం ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, ప్రజలను భాగస్వామ్యులను చేయాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు



ఖదీర్ పాషా, లోకేష్, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...**



మంచిర్యాల, నేటిధాత్రి: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఝాన్సీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ మక్బూల్ పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం తనకు రావలసిన వాటాను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్ వాసులు తమ కాలనీలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కొండగొర్ల చంద్రశేఖర్ తమకు కన్నేపల్లి మండలం పోలంపల్లి శివారులో గల భూమి ఆన్ లైన్ లో ఇతరుల పేరిట నమోదు అయిందని,ఈ పొరపాటున సవరించి తమ పేరిట మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం ఊత్కూర్ కు చెందిన తనుగుల సందీప్ కుమార్ తాను,తన భార్య దివ్యాంగులమని, నిరుపేదలమని,తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన ఎం.ప్రభావతి తనకు కొంత స్థలం ఉందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన తగరం పరంజ్యోతి తమ భూమి నిషేధిత జాబితాలో చూపుతోందని,సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు బాపు తమ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని,భూమి కాగితాలు,ఖరీదైన వస్తువులు, మంచాలు,బట్టలు పూర్తిగా కాలిపోయాయని,తమ కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా బిక్షపతి నియామకం




నస్పూర్, నేటిధాత్రి: అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా క్యాతనపల్లి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన ఉమ్మడి బిక్షపతిని నియమించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం,ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్,ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో సోమవారం బిక్షపతికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ బిక్షపతి గతంలో సంఘం కోసం చేసిన సేవలను,నిర్వహించిన బాధ్యతలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ విశ్వకర్మల ఐక్యత,సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు,సభ్యులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతనంగా నియమితులైన బిక్షపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. విశ్వకర్మ సమాజ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి కర్ణకంటి నరసింహచారి,జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు తెలుకుంట్ల రాజాచారి,నస్పూర్ మండల అధ్యక్షుడు మునిగంటి సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి ఎర్రోజు సాయిరాం, నాయకులు జంబోజు శ్రీనివాస్, ఉప్పుల సత్యనారాయణ, కొత్తూరి రాజమౌళి,వసంతుల గురవయ్య, పొన్నోజు నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం




దుగ్గొండి, నేటిధాత్రి: దుగ్గొండి మండలంలోని మందపల్లి గ్రామంలోని టీజీబీ--ఐరిక్స్ మినీ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఎస్ఐ రావుల రణదీర్‌రెడ్డి ప్రారంభించారు. బ్యాంక్ మిత్ర రౌతు సౌందర్య సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇతరులకు ఆదర్శంగా నిలిచిందని ఎస్ఐ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సర్పంచ్‌లు గ్రామపంచాయతీ నిధులు లేదా దాతల సహకారంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టడంతో పాటు ఘటనలు జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఆధార్ నంబర్, ఖాతా నంబర్, వ్యక్తిగత వివరాలు అడిగితే అప్రమత్తంగా ఉండాలని, అనుమానం ఉంటే గ్రామంలోని మినీ బ్యాంక్ మిత్రను సంప్రదించి వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. గ్రామాల్లోని టీజీబీ--ఐరిక్స్ మినీ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని సమయం ఆదా చేసుకోవాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో టీజీబీ బ్యాంక్ మేనేజర్ జె.సిద్ధార్థ, ఫీల్డ్ ఆఫీసర్ చిన్న నాయుడు, సర్పంచ్ మారేడుగొండ శ్రీమాలత రాజేశ్వరచారి, ఉపసర్పంచ్ రాంపాక భాస్కర్, గ్రామ కార్యదర్శి రవి గొల్ల, కారోబారి వాడికారి బాబురావు, బ్యాంక్ ఖాతాదారులు రేవూరి లింగరెడ్డి, పడిదం మల్లయ్య, లింగాల బుచ్చయ్య, రంగు పూలమ్మ, మాడిశెట్టి వెంకటయ్య, మాడిశెట్టి చంద్రమౌళి, అంబరగొండ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు



నడికూడ, నేటిధాత్రి: మండలంలోని వివిధ గ్రామాలలో గల ఎరువుల, విత్తనాల,పురుగుమందుల దుకాణాలను పరకాల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జాలిగపు అవినాష్ వర్మ , నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీల్లో ఎరువుల పురుగుమందుల నిల్వలు, విక్రయ విధానం,ధరలు, రికార్డులు,రైతులకు అందిస్తున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో అందుబాటులో ఉన్న యూరియా,డిఎపి,కాంప్లెక్స్ ఎరువులు,ఎమ్ఒపి గోపి తదితర ఎరువుల స్టాక్‌ను భౌతికంగా పరిశీలించి, రిజిస్టర్లలో నమోదైన నిల్వలతో సరిపోల్చారు. ఎరువుల,పురుగుమందుల కొనుగోలు,విక్రయాలకు సంబంధించిన బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు,ధరల పట్టిక, ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎరువులను, విత్తనాలను, పురుగుమందులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని,అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం, ఎరువులను బలవంతంగా ఇతర ఉత్పత్తులతో కలిపి విక్రయించడం వంటి చర్యలకు పాల్పడవద్దని డీలర్లకు అధికారులు స్పష్టం చేశారు. అలాగే ప్రతి రైతుకు ఎరువులు,పురుగు మందులు విక్రయించిన అనంతరం తప్పనిసరిగా బిల్లు అందించాలని,స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులను సమయానికి అందుబాటులో ఉంచి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డీలర్లను ఆదేశించారు. ఎరువుల,విత్తనాల పురుగు మందుల విక్రయాలలో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించినట్లయితే సంబంధిత డీలర్లపై నిబంధనల ప్రకారం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు,విత్తనాలు పురుగు మందులు సమయానుగుణంగా అందేలా వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని ఎరువుల దుకాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు ఎరువులు, విత్తనాలు పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని,ఎమ్మార్పీ ధరను పరిశీలించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మెడికల్ కాలేజీ విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎస్ఆర్



**గణపురం, నేటిధాత్రి:** నియోజకవర్గంలోని సోమవారం గణపురం మండలంలోని చెల్పూర్ శివారులో ఉన్న మెడికల్ కాలేజీ విద్యార్థుల కొరకు నూతనంగా నిర్మిస్తున్న హాస్టల్ భవన నిర్మాణ పనులను భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్మాణంలో ఉన్న ప్రతి గదిని సందర్శిస్తూ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి సెప్టెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు మరియు కాంట్రాక్టర్లకు సూచించారు. సుమారు 242 మంది విద్యార్థుల వసతి సౌకర్యార్థం నిర్మిస్తున్న ఈ హాస్టల్ భవనాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణం పూర్తైన అనంతరం హాస్టల్ చుట్టూ ప్రహరీ గోడతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు కూడా కేటాయించి విద్యార్థులకు మెరుగైన వసతి వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి సీపీఎంకు తీరని లోటు



**దుగ్గొండి, నేటిధాత్రి:** సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, సంఘం అఖిలభారత నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి సీపీఎం దుగ్గొండి మండల కమిటీ ఆధ్వర్యంలో గిర్నిబావి సెంటర్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి సీపీఎం పార్టీకి, రైతాంగ ఉద్యమానికి, వామపక్ష భావజాలానికి తీరని లోటని అన్నారు. ఆయన జీవితాంతం ప్రజా, రైతాంగ సమస్యలపై పోరాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. సారంపల్లి మల్లారెడ్డి సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకుడిగా, రైతాంగ ఉద్యమ నాయకుడిగా పనిచేయడంతో పాటు తిమ్మంపేట గ్రామ సర్పంచ్‌గా, తిమ్మంపేట సింగిల్ విండో చైర్మన్‌గా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బోళ్ల సాంబయ్య, మండల కమిటీ సభ్యులు పుచ్చకాయల నరసింహారెడ్డి, చిలుపూరి మొగిలి, చల్లా నరసింహారెడ్డి, అక్కపెల్లి సుధాకర్, పుచ్చకాయల కృష్ణారెడ్డి, కోడూరు రమేష్, యారా నాగరాజు, యారా కుమారస్వామి, చిలువేరి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సారంపెల్లి మల్లారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం



**సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు...**

**నర్సంపేట, నేటిధాత్రి:** సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, నర్సంపేట నియోజకవర్గ ఉద్యమ నిర్మాతలో ఒకరు ప్రజా ఉద్యమ నాయకుడు సారంపెల్లి మల్లారెడ్డి చిత్రపటానికి సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు మాట్లాడుతూ సారంపెల్లి మల్లారెడ్డి తన జీవితాంతం పేదలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడారని అన్నారు. నర్సంపేట ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ఉద్యమకారుడు మల్లారెడ్డి అని కొనియాడారు. ప్రస్తుత తరానికి ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని ఈసంపెల్లి బాబు తెలిపారు. సారంపెల్లి మల్లారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, మంజాల సాయిలు పట్టణ కమిటీ నాయకులు బుర్రి అంజనేయులు కలకోట అనిల్, ఎండీ ఫరీదా, నాయకులు దాసరి నరేష్, కొండి మల్లయ్య, కందికొండ సంతోష్, బి లక్ష్మి, రాజు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సుడాలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి - పైడిపల్లి రాజు



**కరీంనగర్, నేటిధాత్రి:** కరీంనగర్ నగరంలో జరిగిన శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(సుడా) పనుల్లో అవినీతి జరిగిందని ఈయొక్క అవినీతిపై వెంటనే విజిలెన్స్ విచారణ చేపట్టాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. సుడా పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతూ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి ప్రజావాణిలో సిపిఐ బృందం వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా పైడిపల్లి రాజు మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో సూడా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. నగరంలో ఏర్పాటు చేసినటువంటి వీధి దీపాల విషయంలో పూర్తిగా నాసిరకం వస్తువులు వాడాలని ఐదు సంవత్సరాలు గ్యారెంటీ ఉండాల్సిన బల్బులు గ్యారంటీ లేకుండా ధనార్జన ధ్యేయంగా నాసిరకం బల్బులు ఏర్పాటుచేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని జంక్షన్ల ఆధునీకరణలో భాగంగా శాతవాహన యూనివర్సిటీ దగ్గర ఏర్పాటు చేసిన జంక్షన్ లో పనులు చేయకుండానే బిల్లులు ఎత్తుకున్నారని ఇంకా అనేక ప్రాంతాలో జరిగిన పనులలో కూడా పూర్తిగా అవినీతి అక్రమాలు జరిగాయని వెంటనే ప్రభుత్వం ఈయొక్క అవినీతిపై విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలని ప్రజాధనాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సుడాలో అవినీతి జరుగుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం చూస్తుంటే ఈఅవినీతిలో అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు అర్థం అవుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బావశీడ్లపల్లి యుగంధర్, నగర కార్యవర్గ సభ్యులు కసిబోజుల సంతోస్ చారి, బాకం అంజన్న, బోయిని విష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్...
- కేసముద్రం మండల కేంద్రంలో బీజేపీ నిరసన ర్యాలీ...
- తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ...



**కేసముద్రం, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్రంలో నిలిచిపోయిన రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరి వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని మండిపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు కేసముద్రం మండల శాఖ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే, విద్యార్థుల పక్షాన బీజేపీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగోజు నాగేశ్వర చారి, వంగాల కొమ్మాల్ రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, గాంతి వెంకట్ రెడ్డి, మహమ్మద్ ఖాసిం, జుజ్జూరు వీరభద్ర చారి, బానోత్ రాము, బానోత్ సంపత్, వల్లందాస్ నగేష్, మండల, గ్రామ కమిటీల బాధ్యులు, శక్తి కేంద్రాల ఇన్చార్జ్‌లు, అనుబంధ మోర్చాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## గందె సత్యానందంను పరామర్శించిన నాగూర్ల వెంకటేశ్వర్లు



**పరకాల, నేటిధాత్రి:** పరకాల పట్టణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్,సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు తండ్రి గందె సత్యానందం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద హైటెక్ సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను కలిసి సత్యానందం ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించి సత్యానందం త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. గందె సత్యానందం సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని నాగూర్ల వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు.

# కలెక్టర్లు, డీఎఫ్ఓ లతో మంత్రి కొండా సురేఖ సన్నాహక సమావేశం.



**మహబూబాబాద్, నేటిధాత్రి:** రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25న నిర్వహించనున్న 'ప్రత్యేక వనమహోత్సవం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు (డీఎఫ్ఓ)తో మంత్రి సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి తన నివాసం నుంచి జూమ్ వేదికగా సమావేశంలో పాల్గొన్నారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ అరణ్యభవన్ నుంచి సమావేశంలో పాల్గొన్నారు. పలువురు సీసీఎఫ్‌లు, సీఎఫ్‌లు, అటవీశాఖ అధికారులు హాజరయ్యారు.

**జిల్లాల వారీగా సమీక్ష...** ప్రత్యేక వనమహోత్సవం నిర్వహణకు జిల్లాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, ఇప్పటివరకు జరిగిన పురోగతిని మంత్రి సురేఖ సమీక్షించారు. కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం....** ప్రత్యేక వనమహోత్సవంలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు వనమహోత్సవం దోహదపడేలా కార్యక్రమాలను నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వనమహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య, లతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,అనంతరం సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం జిల్లా లక్ష్యాలను శాఖల వారీగా పూర్తి చేయుటకు పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేయాలని రేపు జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, ఈ సమావేశంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యూరియా, డీఏపీ ధరలపై ఫెర్టిలైజర్ వ్యాపారుల మాయాజాలం



**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పలు మండలల్లో పలు గ్రామాల్లో ఎరువులు, పురుగుల మందుల ధరలు సామాన్య రైతులకు గుదిబండ మారుతున్నాయి. తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ఫెర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న వివరాల ప్రకారం, మార్కెట్లో యూరియా ఎమ్మార్పీ ధర 267 రూపాయలు మాత్రమే ఉండగా, దుకాణదారులు మాత్రం దాన్ని ఏకంగా 320 నుండి 350 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అలాగే 1350 రూపాయలు ఉండాల్సిన డి.ఏ.పి ధరను 1850 రూపాయల చొప్పున అమ్ముతూ మనుషులు పీల్చుకుంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అధికారిక యాప్ ద్వారా బుక్ చేసుకుని కొనుగోలు చేసినప్పటికీ, నిర్ణయించిన ధరల కంటే అదనపు వసూళ్లు చేస్తున్నారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఒక్కో షాపులో ఒక్కో రేటు.. అడిగితే నిర్లక్ష్యం!...** ఈ దోపిడీ కేవలం ఎరువులకే పరిమితం కాలేదు. పంటలకు కొట్టే స్ప్రే (పురుగుల మందుల)ను కూడా ఒక్కొక్క షాపులో ఒక్కో రేటుకు విక్రయిస్తు దారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వల్లే వ్యాపారులు ఇంతలా రెచ్చిపోతున్నారని, దొకారుల చేతిలో తాము నిలువునా మోసపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలు మండలల్లో పలు గ్రామాలల్లో ఫెర్టిలైజర్ షాపులపై తనిఖీలు చేపట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ డిమాండ్ చేస్తున్నారు. ప్రతి దుకాణంలోనూ ప్రతి వస్తువు ధరను స్పష్టంగా తెలిపే రేట్ బోర్డును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ కోరుతున్నారు


## జీవో నెంబర్ 97 ను తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

- డిప్లమా పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి డిమాండ్ చేసిన తెలంగాణ రక్షణ సేన...



**కేసముద్రం, నేటిధాత్రి:** జీవో నెంబర్ 97 కు వ్యతిరేకంగా ఈ సముద్రంలో ఉండే పాలిటెక్నిక్ కాలేజ్ నుండి గాంధీ విగ్రహం వరకు టిఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ నాయక్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థుల హక్కుల కోసం రక్షణ కవచంలా టిఆర్ఎస్ పార్టీ కవితమ్మ సారధ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా టిఆర్ఎస్ నాయకులు సంఘటితమై పోరాడుతామని, అదేవిధంగా జీవో నంబర్ 97 ను ప్రభుత్వం తక్షణమే రద్దు చెయ్యకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ఆందోళన ఉధృతం చేసి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తామని డిమాండ్ చేశారు. భారీ ర్యాలీ అనంతరం కలెక్టరేట్ దగ్గర నిరసన కార్యక్రమంలో గాయపడ్డ మొదటి సంవత్సరం చదువుతున్న జాటోతు రాజేష్ ను పరామర్శించారు.

## గందె సత్యానందంను పరామర్శించిన నాగూర్ల వెంకటేశ్వర్లు



**పరకాల, నేటిధాత్రి:** పరకాల పట్టణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్,సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు తండ్రి గందె సత్యానందం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద హైటెక్ సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను కలిసి సత్యానందం ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించి సత్యానందం త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. గందె సత్యానందం సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని నాగూర్ల వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి ఎంపీడీవో శ్రీపతి బాపురావు...



**జైపూర్, నేటిధాత్రి:** మండల ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జైపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపురావు సూచించారు. సోమవారం జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం మూడు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు ఒకటి, పంచాయతీరాజ్ శాఖకు ఒకటి, నీటిపారుదల శాఖకు ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీపతి బాపురావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజావాణిలో నేరుగా అధికారులకు అందజేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, మండల వ్యవసాయ అధికారి సైదా, జైపూర్ వైద్యాధికారి డాక్టర్ ముస్తఫా, కుందారం వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, పశువైద్య సహాయక శస్త్రచికిత్సాధికారి డాక్టర్ వెంకటేష్, పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజనీర్ బి. రాజ్‌కుమార్, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్ కాంక్ష, గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయ ఇంజనీర్ ఎన్. రాజమలయ్య, నీటిపారుదల శాఖ సహాయ ఇంజనీర్ డి. అఖిల, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు గాయత్రి, ఏపీవో బీవీ గ్రామం జి.బి. బాలయ్య, ఏపీఎం ఐకేపీ సీహెచ్ సంతోష్, అటవీ శాఖ సెక్షన్ అధికారి రామకృష్ణ, సంక్షేమ శాఖ అధికారి ఎన్.శ్రీ సాయి లక్ష్మణ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎ. రసూల్, మండల బీసీ సంక్షేమ అధికారి ఈ.సుధాలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కరాటే విభాగం లో గిన్నిస్ బుక్ అఫ్ లో స్థానం సాధించిన ఈషిత

**గుండాల, నేటిధాత్రి:**

గుండాల మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన

ఈషిత కరాటే విభాగంలో ప్రతిభ కనపర్చి గిన్నిస్ బుక్ ఆఫ్ లో స్థానం సాధించడంతో గుండాల మండల ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఆమె ను ఘనంగా సన్మానించారు.

ఆమెను అభినందించారు.



ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు, తవిడిశెట్టి నాగరాజు, వాసవి క్లబ్ మండల అధ్యక్షులు మానాల శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మానాల ఉపేందర్, కోశాధికారి తవిడిశెట్టి రాంబాబు, శ్రీరంగం శ్రీనివాసు, ఈషిత తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## మధునయ్య స్మరణలో సేవా కార్యక్రమం



**మాత శిశు ఆసుపత్రి వద్ద అన్నదానం...**

**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన కీర్తిశేషులు దుర్గం మధునయ్య 3వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాతా శిశు ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని భోజనాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మధునయ్యను స్మరించుకుంటూ ప్రతి ఏడాది వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలు, రోగుల సహాయకులు, ఆసుపత్రికి వచ్చే వారికి భోజనం అందించడం ద్వారా మధునయ్య జ్ఞాపకాలను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం సుగుణ, దుర్గం శ్యామ్‌కుమార్, సల్లూరి శ్రీకాంత్, శ్రవణ్, కుమార్, నవీన్, చిరంజీవి తదితర కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



**కేసముద్రం, నేటిధాత్రి:** పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వల విద్యార్థులకు గ్రామ పెద్దలు, పాఠశాల శ్రేయోభిలాషి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి తరఫున స్నాక్స్ పంపిణీ చేశారు. గంటా సంజీవరెడ్డి తరఫున గ్రామ ఉపసర్పంచ్ పెదగాని రవి, వార్డు సభ్యులు గండి శ్రీనివాస్, గంటా రామ్మోహన్ రెడ్డి, డొంకెను యుగేందర్, జయేంద్ర రెడ్డి, బబ్బి తదితరులు విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి 100 శాతం ఉత్తీర్ణతతో పాటు గతంలో కంటే అధిక సంఖ్యలో త్రిబుల్ ఐటీ సీట్లు సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భేతీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రామ పెద్దలు, పాఠశాల శ్రేయోభిలాషులు అందిస్తున్న సహకారం అభినందనీయమని, వారి ప్రోత్సాహం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తండా సదానందం, వేముల నాగేందర్, మహంకాళి యాకాంబరం, బాసాని బాలా శౌరిరెడ్డి, కొప్పుల శంకర్ (ఫిజికల్ డైరెక్టర్), ఎం.డి. జుబేర్ అలీ, కే. పార్వతి, ఓడపల్లి రాము, కొడారీ రాములు, మార్గం శ్రీనివాస్, జి. నాగరాజు, లచ్చుమ్మ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయమే పాఠశాల విజయానికి ప్రతీకగా నిలవాలని, సమాజం అందించే ప్రతి సహకారాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించింది.

# జనాల మీద పడేనా....?



**కొడిమ్యాల, నేటిధాత్రి:** లేదా బాగుపడేనా....? అనే ఆదివారం రోజున ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామం లో ముదిరాజ్ సంఘం దగ్గర ఉన్న ఐమాక్స్ లైట్ క్రింది భాగంలో తుప్పు పట్టిన పోలును, తొలగించడం జరిగింది. సర్పంచ్ తెలిపిన వివరాల ప్రకారం త్వరలోనే అక్కడ లైట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇక్కడ చీకటిగా ఉండడంతో విషపూరితమైన క్రిమి, కీటకాలు, తిరుగుతున్నందున ఎక్కువ వోల్టేజ్ ఉన్న లైట్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్, ని అధికారులను, ప్రజలు కోరుకుంటున్నారు..

# రోడ్డుకు అడ్డంగా ఉన్న పిచ్చి మొక్కల నరికివేత..



**దుగ్గొండి, నేటిధాత్రి:** గిర్నిబావి నుండి దుగ్గొండి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి తొగర్రాయి నుండి శివాజీ నగర్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న పిచ్చి మొక్కలను ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డి శివాజీ నగర్ సర్పంచ్ నాగరాజు తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఎదగడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నాయని దీంతో ట్రాక్టర్ డోజర్ సహాయంతో తొలగించినట్లు తెలిపారు.

# అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష..



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన యువతిపై అత్యాచారానికి పాల్పడగా యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగింది ఇట్టి దర్యాప్తులో భాగంగా. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామానికి చెందిన జంగపల్లి శ్రీహరి అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడగా యువతి ఫిర్యాదు మేరకు అప్పటి సిరిసిల్ల రూలర్ సిఐ సర్వర్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగింది. అప్పటి సీఐ ఉపేందర్ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్.సీటు దాఖలు చేయగా కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్ నాయుడు శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్. వెన్నెల. కోర్టులో 9 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర శ్రీమతి కె ఝాన్సీ వాదించగా. శాస్త్రీయ ఆధారాలు. సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో సిరిసిల్ల . 1.వ. అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పుష్పలత మేడం గారు నిందితుడైన జంగపల్లి శ్రీహరికి పది సంవత్సరాలు జైలు శిక్ష మరియు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రసంశిస్తూ సమర్థవంతమైన దర్యాప్తులో భాగంగా నిందితులకు వరుసశిక్షలు అమలు అవుతున్నాయని జిల్లా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టిప్రాసిక్యూషన్ సమన్వయంతో వేగవంతమైన విచారణ జరిపిస్తు నిందితులకు వరుస కఠిన శిక్షలు పడేలరుజువు చేస్తూవారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని కఠిన శిక్ష ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ తెలియజేస్తూ. కేసు పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషిచేసిన అప్పటి సిరిసిల్ల సిఐలు సర్వర్ ఉపేందర్. ప్రస్తుత సిఐ నాగేశ్వరరావును తంగళ్ళపల్లి ఎస్సై అశోక్ను. పి పి ఝాన్సీ. కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్ నాయుడు. శ్రావణ్ యాదవ్ ను. కోర్టు కానిస్టేబుల్ రాజేందర్. ఎ.ఎం. కానిస్టేబుల్ నవీన్. వెన్నెలను జిల్లా ఎస్పీ అభినందించారు.

# మల్లారెడ్డి గారి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోట



**ములుగుటౌన్, నేటిధాత్రి:** ములుగు జిల్లాలో జూవీ పార్టీ సీనియర్ నేత,రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి గారి మరణం రైతు ఉద్యమాలకు తీరని లోటు అని, సిపిఎం ములుగు జిల్లా కార్యదర్శి సాంబశివ అన్నారు. సోమవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద మల్లారెడ్డి గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఈరోజు తేదీ 24/8/2026 సోమవారం ఉదయం మూడు గంటలకు సారంపల్లి మల్లారెడ్డి గారు (వయస్సు 88 సంవత్సరాలు) తుది శ్వాస విడిచారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించారని వ్యవసాయ రంగ నిపుణుడిగా నీటిపారుదల రంగంలో నిష్ణాతుడిగా అపార అనుభవం కలిగిన నాయకుడని అనేకమంది రాజకీయ నాయకులు, అధికారులు కూడా మల్లారెడ్డి గారి దగ్గర సలహాలు తీసుకునే వారిని అలాంటి వ్యక్తి మరణించడం బాధాకరమని మల్లారెడ్డి గారి మృతికి సిపిఎం జిల్లా కమిటీ తరపున సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ములుగు జిల్లాలో రైతు ఉద్యమాలలో సారంపల్లి మల్లారెడ్డి గారు ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు.దేవాదుల కంతానపల్లి ప్రాజెక్టు కోసం జరిగిన పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు.సీడ్ పత్తి సాగులో నష్టపోతున్న రైతులకు అండగా వ్యవసాయ శాస్త్రవేత్తలను తీసుకువచ్చి పంట పొలాలు సందర్శించి రైతులకు మద్దతుగా రాష్ట్రస్థాయిలో అధికారులతో, మంత్రులతో అనేక పర్యాయాలు చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి ఈ ప్రాంత రైతులకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఆయన రైతాంగా సమస్యల పరిష్కారానికి దిక్సూచి గా ఉండేవారని అన్నారు వరంగల్ జిల్లాలో పుట్టిన మల్లారెడ్డి గారు ఆ జిల్లా లో సిపిఎం పార్టీ నిర్మాణంలో రైతు సంగం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, కంట్రోల్ కమిషన్ చైర్మన్ గా, బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. కమ్యూనిస్టు నాయకునిగా నిరాడంబరమైన జీవితం గడిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రజాసంఘాల నాయకులు దేవేందర్ రావు యాకుబ్ పాషా జెజ్జర దామోదర్ రత్నం ప్రవీణ్ కవిత రవితేజ బాలు మహేష్ లతో పాటు 20 మంది తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి పలు సమస్యలపై దరఖాస్తుల.



**కొడిమ్యాల, నేటిధాత్రి:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 10 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో ఇ.స్వరూప తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని,వాటిని సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఎంపీడీవో స్వరూప స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీవన బంధం... చెట్లతోనే మన అనుబంధం

- మొక్కలు పెంచుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- ప్రతి ఒక్కరూ తమ జన్మదినం రోజున రెండు ముక్కలు నాటాలి
- కాలనీలన్నీ పచ్చదనంతో విరాజిల్లాలి..
- చామ విజయ శేఖర్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు





**నేటిధాత్రి, రంగారెడ్డి:**
కుంట్లూరు ఆది తిరుమల నగర్ కాలనీలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కాలనీవాసులందరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు చాలా విజయ శేఖర్ రెడ్డి అదేవిధంగా మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ కాలనీ అధ్యక్షులు మరియు కాలనీ కమిటీ సభ్యులు అందరూ కలిసి మొక్కలు నాటారు..

ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చామ విజయ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అదేవిధంగా కాలనీలోని ప్రతి ఒక్క కుటుంబ సభ్యుడు తమ జన్మదిన పురస్కరించుకొని రెండు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కాలనీలో మొక్కలు నాటిన అనంతరం వాటి సంరక్షణ బాధ్యత కూడా కాలనీ కమిటీ సభ్యులు అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది తీసుకోవాలని దానిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని కాపాడాలని తెలియజేశారు..

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కలను సంరక్షించే బాధ్యత కాలనీవాసులతో పాటు మేము కూడా మున్సిపల్ సిబ్బంది గా ఈ బాధ్యత తీసుకుంటామని తెలుపుతూ అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఆది తిరుమల నగర్ కాలనీ అధ్యక్షులు మాదారపు అశోక్,ఉపాధ్యక్షులు దోమకొండ శ్రీనివాస్,కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్,జనరల్ సెక్రెటరీ లింగస్వామి మరియు కాలనీ సభ్యులు దుర్గాప్రసాద్,ప్రభాకర్,అన్వర్,శంకర్,బాలసుబ్రమణ్యం, సోమయ్య,రవి,మనసాని కాలనీ అధ్యక్షులు రెడ్డి వీర్రాజు, మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు నిర్వహించాలి

- మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి...
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి...
- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి...
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి....



**జగిత్యాల, నేటిధాత్రి:** ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.





సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామ సభలు/వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సభల వద్ద ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.గ్రామ సభ/వార్డు సభలో బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని, జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని సూచించారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం-8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు వివరించాలని అన్నారు. అర్హత లేకపోయినా జాబితాలో పేరు నమోదైన వారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం-7 ద్వారా అభ్యంతరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని సూచించారు.జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మొత్తం 1,92,962 నోటీసులు జనరేట్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,59,098 నోటీసులు జనరేట్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఏఈఆర్ఓలతో ప్రత్యేకంగా సమావేశమైన జిల్లా కలెక్టర్, నోటీసుల జారీ, పంపిణీ, యాప్‌లో వివరాల అప్‌లోడ్ ప్రక్రియపై సమీక్షించారు. ప్రతి ఏఈఆర్ఓ నుంచి వేగవంతమైన చర్యల కోసం కార్యాచరణ ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్, పంపిణీ, అప్‌లోడ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.నోటీసులు అందజేసిన ప్రతి సందర్భాన్ని బీఎల్ఓ యాప్‌లో ఫోటోతో సహా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 821 నోటీసులు అందజేసినప్పటికీ, వాటిలో 77 నోటీసుల పంపిణీ వివరాలు మాత్రమే యాప్‌లో అప్‌లోడ్ అయినట్లు తెలిపారు. నోటీసు అందజేయడం, దానికి సంబంధించిన ఫోటో, వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడం ఏకకాలంలోనే జరగాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.నోటీసుల వివరాల నమోదు, అప్‌లోడ్ విషయంలో కేవలం డీటీపీ ఆపరేటర్లపై ఆధారపడవద్దని, తప్పులు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత ఎంఆర్ఓలు స్వయంగా పరిశీలించి ధ్రువీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసుల జారీ, పంపిణీ, వివరాల అప్‌లోడ్ ప్రక్రియకు సంబంధించి ఏఈఆర్ఓలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బి ఎల్. ఓ.లకు నేరుగా ఫోన్ లో పర్యవేక్షించాలని ఆదేశించారు.ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ సభలు/వార్డు సభలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని



ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్.డి. వో లు, ఏఈఆర్ఓలు, మున్సిపల్ కమిషనర్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరులో పాడి రైతు కార్యాలయం ప్రారంభించిన..

## ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి..



**చిలుకూరు, నేటిధాత్రి:** మండల కేంద్రంలో పాడి రైతులకు మేలు జరిగేలా నూతన కార్యాలయం ఏర్పాటయింది. నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన భానుపురి పాడి రైతు ఉత్పత్తిదారుల పరస్పర కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, నాబార్డ్ డి డి ఎం రవీందర్ నాయక్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. రైతులకు నాబార్డ్ అందిస్తున్న సహకారం అభిరుందినీయమని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యాలయం అందుబాటులోకి రావడంతో స్థానిక పాడి రైతుల పశువుల దానా రుణాలు సాంకేతిక సలహాలు తదితర సేవలు సులభంగా అందనున్నాయి. కార్యక్రమంలో వైద్యాధికారి ఏడి డాక్టర్ పి. పెంటయ్య, పశు వైద్యాధికారి కె. వీరారెడ్డి ఐ ఆర్ డి ఎన్, ఎన్జీవో వ్యవస్థాపకులు వాడపల్లి రమేష్, సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, తహసిల్దార్ ధ్రువ కుమార్, ఎంపీడీవో ముక్కు పార్టీ నరసింహారావు, సీఈఓ అఖిల్ రెడ్డి, చైర్మన్ కోడారు రాము, డైరెక్టర్లు కందుకూరి కృష్ణమూర్తి, నెల్లూరి నాగేశ్వరరావు, మాతంగి వీరస్వామి, ఉబ్బపల్లి మంగమ్మ, పులగం ప్రభాకర్, శిరీష, స్వాతి, రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు వెంకన్న, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, షేక్ సౌంద్ మియా, నాయకులు కొల్లు నాగయ్య, ముందు రమేష్, గంగిరెడ్డి నాగిరెడ్డి, ఎడవపల్లి పుల్లారావు, కోలా గురుస్వామి, అల్సకాని వెంకటయ్య, గుండు వెంకటేశ్వర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రేగా రాకతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త జోష్


- ముఖ్య కార్యకర్తల భేటీతో నియోజకవర్గంలో మళ్లీ మొదలైన రాజకీయ సందడి....
- భవిష్యత్ కార్యాచరణపై పార్టీ కేడర్‌తో సుదీర్ఘ సమాలోచనలు....
- భారీగా హాజరైన అళ్లపల్లి మండల నాయకులు....



**అళ్లపల్లి, నేటిధాత్రి:** మాజీ ప్రభుత్వ విప్, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తిరిగి రాజకీయంగా క్రియాశీలకం కావడంతో నియోజకవర్గంలోని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది.ఇటీవల తనపై రాజకీయ దురుద్దేశంతో బనాయించిన లైంగిక వేధింపుల అక్రమ కేసును ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) కొట్టివేయడంతో ఆయనకు పూర్తి ఊరట లభించింది. ఈ న్యాయపోరాటంపై దృష్టి సారించిన క్రమంలో కొంతకాలం పాటు రాజకీయ కార్యకలాపాలకు విరామం ఇచ్చిన రేగా, న్యాయస్థానంలో విజయం సాధించిన అనంతరం తొలిసారిగా సోమవారం మణుగూరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు.రేగాకు ఘన స్వాగతం.. న్యాయమే గెలిచిందంటూ కేడర్ సంబరాలు:రాజకీయ ప్రత్యర్థులు కావాలనే అసత్య ఆరోపణలతో అక్రమ కేసులు బనాయించారని, అయితే ఉన్నత న్యాయస్థానం ఆ కేసులను పూర్తిగా కొట్టివేయడం ద్వారా నిజం నిగ్గుతేలిందని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. కోర్టు తీర్పు వెలువడిన నాటి నుంచే నియోజకవర్గవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవగా, రేగా ప్రత్యక్షంగా రంగంలోకి దిగడంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైంది. ఆయన రాకతో మండలాల వారీగా పార్టీ శ్రేణుల్లో స్తబ్దత వీడి నూతన జోష్ సంతరించుకుంది.భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ మంతనాలు:మణుగూరులో జరిగిన ఈ సమావేశానికి అళ్లపల్లి మండలంతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి భారీ సంఖ్యలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి రేగా కాంతారావుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ సంస్థాగత బలోపేతం వంటి అంశాలపై ఆయన నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం అళ్లపల్లి మండల నాయకులు మాట్లాడుతూ.. తమ ప్రియతమ నేతపై ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల్లో ఆయనకున్న ఆదరణను తగ్గించలేరని పేర్కొన్నారు. రేగా నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తామని ముక్తకంఠంతో స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అళ్లపల్లి మండల పార్టీ అధ్యక్షుడు నరసింహారావు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, వార్డు సభ్యులు ఎల్లాగౌడ్, వెంకట కృష్ణంరాజు, సాంబయ్య, శేఖర్, రాంబాబు, నవీన్, అనుబంధ సంఘాల నాయకులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


# క్యాంటీన్ కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ

## ఆహార భద్రతా జిల్లా అధికారివరుణ్‌రెడ్డి.



**భూపాలపల్లి, నేటిధాత్రి:** సోమవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డైట్ క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆహార భద్రతా జిల్లా అధికారి జి. వరుణ్ రెడ్డి తనిఖీ చేశారు ఆహార ముడి పదార్థాల కోసం సరైన ఆహార నిల్వ సౌకర్యం లేదు.ఆహార పదార్థాలను నిర్వహించేవారు టోపీలు, చేతి తొడుగులు ధరించలేదు. ఆహార పదార్థాలను నిర్వహించేవారికి వైద్య ధృవపత్రాలు లేవు. కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేసి, నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించడం జరిగిందని ఆహార భద్రతా అధికారి, జి. వరుణ్ రెడ్డి తెలిపారు.

# ఈ నెల 27న గ్రామ,వార్డు సభలు



- ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించాలి...
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి...

**మంచిర్యాల, నేటిధాత్రి:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ,వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు.సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా ఎన్నికల అధికారులు,ఎన్నికల నమోదు అధికారులు,సహాయ ఎన్నికల నమోదు అధికారులతో గ్రామ, వార్డు సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా ఈ నెల 27న నిర్వహించే గ్రామ,వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు గైర్హాజరు, చిరునామా మారిన, మరణించిన ఓటర్ల జాబితాను బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకుల సమక్షంలో ప్రజలకు చదివి వినిపించాలని తెలిపారు.ఓటర్ల జాబితాపై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేయాలని సూచించారు.గ్రామ, వార్డు సభల సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ఫారం--6, ఫారం--7, ఫారం--8లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.అనామలీస్ ఉన్న, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న నోటీసుల జారీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి సంబంధిత ఓటర్లకు నోటీసులు అందించాలని ఆదేశించారు.అవసరమైన ప్రాంతాల్లో అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారుల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలను మంగళవారం లోగా పంపించాలని సూచించారు.



- మూడు రోజుల్లో నోటీసులు అందిస్తాం....

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో అనామలీస్,మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన నోటీసుల తయారీ ప్రక్రియ దాదాపు పూర్తయిందని తెలిపారు.సంబంధిత ఓటర్లకు మూడు రోజుల్లోగా నోటీసులు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఈ నెల 27న గ్రామ,వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారుల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే పంపించినట్లు వెల్లడించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజన్న మండల అధికారి శ్రీనివాసరావు,శిక్షణ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ,అన్ని మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటిధాత్రి 9
NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

## "నేటిధాత్రి" పత్రికను ఆదరించిన విధంగానే "నేటిధాత్రి 9" " యూట్యూబ్ ఛానల్ " కూడా ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

**సంప్రదించవలసిన చిరునామా..**


Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

ఆరోగ్య ధాత్రి

మంగళవారం

# ఆరోగ్యం కోసం స్త్రీలు ఈ 4 పనులు తప్పక చేయాలి

## నెలరోజుల్లోనే తేడా కనిపిస్తుంది!



**డెస్క్,నేటిధాత్రి:**
మహిళలు ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకొనే వరకు ఇంటాబయట పనులతో ఫుల్ బిజీగా ఉంటారు. నిమిషం తీరిక లేకుండా పనుల్లో నిమగ్నమైపోతారు. అయితే గృహ బాధ్యతల కారణంగా మహిళలు తరచుగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఏ వయస్సులోనైనా, వారి జీవనశైలిని కొద్దిగా మార్చడం ద్వారా, వారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, వ్యాధులను నివారించవచ్చు వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది. కాబట్టి మహిళలు గుర్తుంచుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని ఆరోగ్యంగా ఉంచుకోగల ప్రాథమిక విషయాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

శారీరక శ్రమ: క్రమం తప్పకుండా వ్యాయామం చేసే స్త్రీలకు మెరుగైన రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలు ఉంటాయి. గుండె జబ్బులు, మధుమేహం , బీపీ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. మహిళలు మెనోపాజ్‌కు చేరుకోవడం , శారీరకంగా చురుకుగా ఉండటం వలన, వారు అనేక సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. కాబట్టి ప్రతి స్త్రీ వారానికి 4-5 రోజులు 30-60 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

### చక్కగా నిద్రపోండి:

ఆధునిక జీవనశైలి కారణంగా చాలా మంది మహిళలకు రాత్రిపూట నిద్రపోవడం కష్టంగా మారుతోంది. అయితే మీ ఇతర బాధ్యతల మాదిరిగానే నిద్రకు కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. విశ్రాంతి తీసుకోవడానికి తగినంత నిద్ర పొందడం వలన మీరు ఆరోగ్యంగా ఉండటానికి , మీ శరీరాన్ని శక్తివంతంగా ఉంచడంలో సహాయపడుతుంది.

శారీరక పరీక్ష : ఏటా మీ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని నిర్ధారించుకోండి, ఇది మీకు ఏదైనా తీవ్రమైన అనారోగ్యం వచ్చే ప్రమాదం నుంచి వెంటనే బయటపడేలా చేస్తుంది. అటువంటి పరిస్థితిలో, వైద్యులు అధిక రక్తపోటు , అధిక స్థాయి అనారోగ్య కొలెస్ట్రాల్ వంటి ప్రాథమిక విషయాలను తనిఖీ చేస్తారు.

### ఆహారంపై శ్రద్ధ వహించండి:

మీరు తినే దానిపై శ్రద్ధ వహించండి. ఆరోగ్యకరమైన ఆహారం అంటే రుచి లేని ఆహారం కాదు. బదులుగా, ఇది ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు , కార్బోహైడ్రేట్లతో కూడిన భోజనం తినాలి . మీరు దీనికి రకరకాల కూరగాయలు , పండ్లను జోడించవచ్చు.

# చలికాలంలో జలుబు, దగ్గు వేధిస్తోందా?

- "ఉసిరి టీ" తాగితే మంచిదట! - పైగా ఈ ప్రయోజనాలు కూడా! ఆయుర్వేదంలో ఉసిరి వినియోగం అధికం
- ఇండియన్ గూస్ బెర్రీతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు



**హైదరబాద్,నేటిధాత్రి:**
చలికాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంటుంది. ఈ సీజన్‌లో శరీరం నిస్తేజంగా మారడమే కాదు.. వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేగంగా శరీరంలోకి చేరి.. జలుబు, దగ్గు, జ్వరాలు ఇబ్బందిపెడుతుంటాయి. ఇలాంటి సమయంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు తీసుకోవాలి. తద్వారా ఎలాంటి రోగాలతో అయినా పోరాడే సామర్థ్యం లభిస్తుంది. అలా ఇమ్యూనిటీ అందించే ఫుడ్స్?లో ఉసిరితో తయారయ్యే టీ కూడా ఒకటి. మరి దీని వల్ల కలిగే ప్రయోజనాలు, ఎలా తయారు చేసుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం..

### ఉసిరి టీ ఆరోగ్య ప్రయోజనాలు:

రోగ నిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుందని.. ఫలితంగా శరీరం బాక్టీరియా, వైరస్‌లతో సమర్థవంతంగా పోరాడగలుగుతుందని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ శుభాంగి తమ్మళ్వార్ అంటున్నారు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు జలుబు వల్ల కలిగే గొంతు నొప్పి, వాపు వంటి లక్షణాలను తగ్గిస్తాయని అంటున్నారు.

జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది : ఉసిరి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు. ముఖ్యంగా మలబద్ధకాన్ని నివారిస్తుందని చెబుతున్నారు. అంతేకాదు.. ఉసిరి.. జీర్ణ రసాల స్రావాన్నీ ప్రేరేపించి పోషకాల శోషణను మెరుగుపరుస్తుందని.. ఫలితంగా అజీర్ణం, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గిపోతాయంటున్నారు.

కళ్ల ఆరోగ్యానికి మంచిది: ఉసిరి కళ్ల ఆరోగ్యానికి చాలా మంచిదని అంటున్నారు. ఇది కంటి చూపును మెరుగుపరుస్తుందని, గ్లాకోమా వంటి కంటి సమస్యలను నివారిస్తుందని అంటున్నారు. అలాగే ఉసిరిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కంటి వాపును తగ్గించి.. కంటి ఎరుపు, దురద వంటి సమస్యలను తగ్గిస్తుందని చెబుతున్నారు.

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: ఉసిరిలో యాంటీ-డయాబెటిక్ లక్షణాలు అధిక పరిమాణంలో ఉంటాయని.. రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయని అంటున్నారు. 2020లో జర్నల్? ఆఫ్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. ఆమ్లా సారం గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుందని, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుందని కనుగొన్నారు.

కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తుందని అంటున్నారు. తద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గుతుందని అంటున్నారు.

ఫ్రీ రాడికల్స్ నష్టం తగ్గుతుంది : ఉసిరిలోని విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుందని నిపుణులు అంటున్నారు. అలాగే ఈ పండులో పాలీఫెనాల్స్, టానిన్, ఫ్లేవనాయిడ్లు ఉంటాయని.. ఇవన్నీ శరీరాన్ని ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుంచి రక్షించడంలో చాలా బాగా సహాయపడతాయంటున్నారు.

జుట్టు, చర్మ ఆరోగ్యానికి మేలు : ఉసిరిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు జుట్టు, చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా వెంట్రుకల కుదుళ్లు బలంగా మారి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుందంటున్నారు. అలాగే, ఉసిరి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు స్కిన్ ఇరిటేషన్, మొటిమలను తగ్గిస్తాయని.. వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తాయంటున్నారు.

క్యాన్సర్?ను నిరోధించడం: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడతాయని అంటున్నారు. ఇదే విషయాన్ని %చీ×ఎ% సభ్యుల బృందం కూడా స్పష్టం చేసింది.(రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్?చేయండి).

ఉసిరి టీ ఎలా తయారు చేయాలంటే: గిన్నెలోకి ఓ గ్లాస్ నీళ్లు పోసి చెంచా ఎండబెట్టిన ఉసిరి పొడి, కొద్దిగా అల్లం తరుగు, రెండు తులసి ఆకులు, చిటికెడు వేయించిన జీలకర్రపొడిని వేసి బాగా మరగబెట్టాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు తేనె, నిమ్మరసం చేర్చి తాగితే సరి. లేదంటే తాజా ఉసిరికాయను తురిమి మిక్సీలో పేస్టులా చేసుకోవాలి. దాన్ని నీళ్లలో మరిగించి కూడా టీ రూపంలో తీసుకోవచ్చు.

NOTE : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# బీట్‌రూట్‌ను రోజూ ఎందుకు తినాలో తెలుసా..?

## కారణం తెలిస్తే వెంటనే తినడం మొదలుపెడతారు..!



బీట్‌రూట్ అంటే చాలా మందికి ఇష్టం ఉండదు. దీని రుచి చాలా మందికి నచ్చదు. అలాగే బీట్‌రూట్‌ను ముట్టుకుంటే చాలు రంగు అంటుతుంది. కనుక దీన్ని తినేందుకు చాలా మంది అంత ఇష్టతను ప్రదర్శించరు. అయితే వాస్తవానికి బీట్‌రూట్‌ను సూపర్ ఫుడ్ అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లు, మినరల్స్ బీట్‌రూట్‌లో ఉంటాయి. కనుక బీట్‌రూట్‌ను తినాలని వారు సూచిస్తున్నారు. బీట్‌రూట్‌ను రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని వారు అంటున్నారు. బీట్‌రూట్‌లో నైట్రేట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. దీంతో రక్తనాళాలు వెడల్పుగా మారుతాయి. దీని వల్ల రక్త సరఫరాకు ఉండే అడ్డంకులు తొలగిపోయి రక్తం సరిగ్గా సరఫరా అవుతుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది.

### గుండె జబ్బులు రావు..

బీట్‌రూట్‌ను తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో వెల్లడైంది. కనుక బీట్‌రూట్‌ను రోజూ తింటే గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. బీట్‌రూట్‌లో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల కణాలు డ్యామేజ్ అవకుండా చూసుకోవచ్చు. అలాగే తీవ్రమైన వ్యాధులైన క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. బీట్‌రూట్ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ చాలా తక్కువ. అలాగే ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. కనుక బీట్ రూట్‌ను తింటే బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. డయాబెటిస్ ఉన్నవారు బీట్‌రూట్‌ను తింటుంటే రక్తంలో చక్కెర స్థాయిలను చాలా సులభంగా మేనేజ్ చేసుకోవచ్చు. డయాబెటిస్‌ను అదుపు చేయవచ్చు.

### బరువు తగ్గవచ్చు..

బీట్‌రూట్‌లో ఉండే నైట్రేట్లు మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. దీంతో ఇవి మెదడుకు రక్త సరఫరాను పెంచుతాయి. దీని వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. మెదడు యాక్టివ్‌గా మారుతుంది. ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి బీట్‌రూట్ ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలని చూస్తున్నవారు కచ్చితంగా బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి.

### జీర్ణ వ్యవస్థ పనితీరుకు..

బీట్‌రూట్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. అలాగే వ్యాధులను తగ్గిస్తుంది. దీంతో సీజనల్‌గా వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. బీట్‌రూట్‌ను రోజూ తినడం వల్ల లివర్ శుభ్రంగా మారుతుంది. లివర్‌లోని వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం కూడా అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. బీట్‌రూట్‌లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది. మలబద్దకం సమస్య ఉన్నవారు రోజూ బీట్‌రూట్ ను తింటే త్వరగా ఆ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇలా బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# మీ జుట్టుకు రక్షణ ఈ పొడులే!



ఆయుర్వేదంలో జుట్టును సంరక్షించుకోవటానికి అనేక పద్ధతులు ఉన్నాయి. వీటిలో హెయిర్‌మాస్కలను తయారుచేసుకోవటం ఒక ప్రధానమైన అంశం. ఈ హెయిర్‌మాస్కను ఎలా తయారుచేసుకోవాలో చూద్దాం..

### తయారీ విధానం

మన జుట్టును సంరక్షించే అనేక రకాల పౌడర్లు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఒక గిన్నెలోకి తీసుకొని.. వాటిని నీటితో కానీ.. పెరుగుతో కానీ.. కొబ్బరినూనెతో కానీ కలపాలి. ఆ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి 30 నిమిషాలు వదిలేయాలి. ఆ తర్వాత షాంపుతో జుట్టును కడగాలి. ఇప్పుడు ఆ పౌడర్లు ఏమిటో చూద్దాం..

### భృంగరాజ పొడి

భృంగరాజను మూలికల్లో రారాజుగా పిలుస్తారు. ఇది జుట్టును బలంగా చేస్తుంది. జుట్టు ఊడిపోకుండా కాపాడుతుంది. కొందరిలో జుట్టు తెల్లపడకుండా అడ్డుకుంటుంది.

### ఉసిరి పొడి

ఉసిరి పొడిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది జుట్టు నిగనిగలాడేలా చేస్తుంది. జుట్టు బలంగా పెరగటానికి ఉపకరిస్తుంది.

### వేప పొడి

కొందరికి మాడుపై బ్యాక్టీరియా చేసి రకరకాల సమస్యలు ఏర్పడుతూ ఉంటాయి. దురద పెడుతూ ఉంటుంది. ఈ సమస్యలకు వేప పొడి మంచి పరిష్కారమని చెప్పాలి.

### మందార పొడి


మందారంలో విటమిన్స్, అమినో యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి జుట్టు ఊడిపోకుండా రక్షిస్తూ ఉంటాయి.

### మెంతి పొడి

మెండి పొడిలో ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్‌లు ఉంటాయి. ఇవి జుట్టు ఉడిపోకుండా రక్షణ కవచంలా పనిచేస్తాయి. మెంతి పొడిని పెరుగుతో కలిపి రాస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి.

### కుంకుడు పొడి

జుట్టులో ఉండే దుమ్మును తొలగించటంలో కుంకుడు పొడి ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. దీని వల్ల జుట్టులో సహజంగా ఉండే నూనెలకు ఎటువంటి ప్రమాదం ఉండదు. షికాకాయ్ పొడి కూడా జుట్టు ఆరోగ్యంగా పెరగటానికి ఉపకరిస్తుంది.



# బిగిసడలిన అందాలకు అద్భుతమైన వ్యాయామాలు

అందానికి మగువలు ఇచ్చే ప్రాధాన్యం అంతాఇంతా కాదు. వివాహం జరిగి పిల్లలు పుట్టాక వారిలోని బిగువు కొంత సడలుతుంది. దీంతో వారిలో ఆందోళన మొదలవుతుంది. వక్షోజాలు వదలు కావడాన్ని చాలామంది జీర్ణించుకోలేరు. అయితే, ఇందుకు బోల్డన్ని కారణాలు కూడా ఉండొచ్చు. అంటే జీవనశైలి, జెనెటిక్స్, ఆరోగ్యంపైనా ఇది ఆధారపడి ఉంటుంది. ఇలాంటి వారికి 20 ఏళ్ల వయసులోనే వక్షోజాల బిగుత సడలిపోయి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ మాత్రానికే కుంగిపోవాల్సిన అవసరం లేదు. చిన్నచిన్న వ్యాయామాల ద్వారా వదులైన వక్షోజాలను బిగుతుగా చేసుకోవచ్చు. పూర్వ స్థితికి తీసుకురావొచ్చంటున్నారు నిపుణులు. అవేంటో ఇప్పుడు చూద్దాం.

వైడ్ టు క్లోజ్ పుషప్

ఈ వ్యాయామం కోసం తొలుత పుషప్ పొజిషన్ తీసుకోవాలి. చేతులు సరిగ్గా మీ భుజాల కింద కాస్త ఎడంగా ఉండాలి. ఆ తర్వాత వ్యాయామం ప్రారంభించాలి. ఈ క్రమంలో వక్షోజాలు నేలకు తగిలేలా పుషప్స్ చేయాలి. ఆ తర్వాత మళ్లీ పైకి లేవాలి. ఇలా కిందికిపైకి 15 రెప్స్‌తో 3 సెట్లు పూర్తిచేయాలి.

డంబెల్ బెంచ్ ప్రెస్

ఈ వ్యాయామంలో వెనక ఓ ఏటవాలు బెంచ్ లాంటిది ఉండాలి. దానికి ఆనుకుని రెండు చేతుల్లో రెండు డంబెల్స్ పట్టుకోవాలి. అరచేతులు పాదాలకు ఎదురుగా ఉండాలి. ఇప్పుడు కాళ్లను గాల్లోంచి నేలపైకి నెమ్మదిగా తీసుకొచ్చి ఊపిరి తీసుకోవాలి. ఇప్పుడు డంబెల్స్ ఉన్న చేతలను చాతీపైకి నిలువుగా తీసుకురావాలి. ఈ క్రమంలో డంబెల్స్ రెండు ఒకదాన్ని ఒకటి నెమ్మదిగా తాకాలి. అంటే చేతులు 'వి' ఆకారంలో కదలాలన్నమాట. ఆ తర్వాత చేతులను నెమ్మదిగా కిందికి దించాలి. ఇప్పుడు శ్వాసను విడిచిపెట్టాలి. ఆ తర్వాత మళ్లీ మునుపటిలా చేయాలి. ఇలా 15 రెప్స్‌తో 3 సెట్లు చేయాలి.

ఇంక్లైన్ డంబెల్ ఫ్లై

డంబెల్ బెంచ్ ప్రెస్‌లానే దీనిని కూడా ఏటవాలు బెంచ్ పైనే చేయాలి. రెండు చేతుల్లో రెండు డంబెల్స్ పట్టుకుని చేతులను నిటారుగా లేపాలి. ఇప్పుడు చేతులను అలాగే వెనక్కి వంచాలి. అంటే సమాంతరంగా తీసుకురావాలి. ఇప్పుడు ఒక క్షణం ఆగి శ్వాసను వదులుతూ చేతులను మళ్లీ యథాస్థానంలోకి తెచ్చుకోవాలి. దీనిని కూడా మూడుసెట్లుగా చేయాలి.

కేబుల్ క్రాసోవర్

ఇందులో మిషన్ పుల్లీ హ్యాండిళ్లను కిందకు లాగాల్సి ఉంటుంది. ఇందుకోసం మొదట మిషన్ రెండు వైపులా పుల్లీలను హై లెవల్‌కు సెట్ చేసుకోవాలి. అలాగే, బరువును సర్దుబాటు చేసుకోవాలి. తొలుత తేలికైన బరువుతో ప్రారంభించి ఆ తర్వాత సౌకర్యంగా అనిపిస్తే బరువును పెంచుకుంటూ పోవచ్చు. మిషన్ మధ్యలో నిలబడి పాదాలను భుజం వెడల్పులో ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు కుడి కాలిని ఒక అడుగు ముందుకు వేసి పుల్లీలను లాగాలి. ఈ క్రమంలో నడుమును కూడా కొంచెం వంచి చాతీ కండరాలు సాగినట్టు అనిపించే వరకు చేతులను చాచాలి. ఊపిరి పీల్చుకుని తిరిగి యథాస్థానానికి రావాలి. ఇలా 15 రెప్స్ చేయాలి.

కోబ్రా పోజ్

ఈ వ్యాయామంలో పొట్టను నేలకు ఆనించి పడుకోవాలి. ఆ తర్వాత అరచేతులను నేలకు ఆన్చాలి. ఆపై నేలను నెడుతూ తలను నెమ్మదిగా పైకి లేపాలి. అలా నడుమును కదపకుండా చాతీభాగం వరకు లేపాలి. ఈ క్రమంలో ఊపిరి పీల్చుకోవడం మర్చిపోకూడదు. తిరిగి ప్రారంభ స్థానానికి వచ్చే వరకు మూడు సెకన్ల పాటు అలాగే ఉండాలి. ఇవి కూడా మూడు సెట్స్ చేయాలి. ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం ద్వారా వక్షోజాలను తిరిగి పూర్వస్థితికి తీసుకొచ్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.




# విశ్వ విద్యాలయమా! వినోద కేంద్రమా!!



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

- సినిమా ఈవెంట్లు నిర్వహించే వ్యాపార స్థలమా!
- యూనివర్సిటీ లో సినిమా ఈవెంట్ కు అనుమతి ఎలా ఇచ్చారు?
- పోలీస్ బందోబస్త్ ఎలా సమకూర్చారు!
- ప్రమాదం జరిగినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?
- విద్యార్థుల కు గాయలైనా పోలీస్ శాఖ ఏం చేస్తోంది?
- సినిమా కు ఎ సర్టిఫికెట్ ఎందుకిస్తారో మల్లారెడ్డి కి అవగాహన ఉందా?
- విద్యార్థి సంఘాలు ఎక్కడున్నాయి?
- మానవ హక్కుల సంఘాలు ఏం చేస్తున్నాయి?
- విద్యా శాఖ ఏం చేస్తున్నట్లు?
- ఈవెంట్ల పేరుతో విద్యార్థుల ప్రాణాలు పోయినా పర్వాలేదు అనుకుంటున్నారా?
- హ్యూమన్ రైట్స్ కమిషన్ దాకా ఈ సంఘటన చేరలేదా?
- మల్లారెడ్డి మీద క్రిమినల్ చర్యలు తీసుకోరా?
- డయాస్ మీద నుంచి విద్యార్థులనే బెదిరిస్తారా?
- ఇక కాలేజీలో ఈవెంట్లు జరగకుండా పోయాయని అగ్రహం వ్యక్తం చేస్తారా?
- మల్లారెడ్డి కాలేజీలు మూసుకొని ఈవెంట్లు చేసుకో.?

## చేసేవి పాడు పనులు..చెప్పేవి నీతి సుద్దులు! విద్యా వ్యవస్థకే మల్లారెడ్డి చీడ పురుగు!?

**హైదరాబాద్, నేటిధాత్రి:** మల్లారెడ్డి కాలేజీల సమూహమా? లేక వినోద కేంద్రమా? అనే ప్రశ్న ఇప్పుడు సమాజంలో తలెత్తుతోంది. పాలమ్మిన,పూలమ్మిన కష్టపడిన అని గొప్పలు చెప్పుకునే మల్లారెడ్డి ఆదర్శమా? లేక విద్యా వ్యవస్థకే అవమానమా? ఒక బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధి మాట్లాడాల్సిన మాటలా? చేయాల్సిన చేష్టలా? అనుసరించాల్సిన విదానాలా? నోరు వుంది కదా? అని ఏది పడితే అది వింటున్నారు. అనుకున్నప్పుడు నోరు జారడం అలవాటు చేసుకుంటారు. అదే పదే పదే వల్లె వేస్తుంటారు. మల్లారెడ్డి విద్యా సంస్థల అదినేతగా వుండి అడ్డగోలు



మాటలు మాట్లాడినప్పుడే సమాజం,రాజకీయ వ్యవస్థ, మీడియి ప్రశ్నిస్తే ఇలాంటి దుర్మార్గాలు జరకుండా పోయేవి. కాలేజీకి సంబంధించిన కార్యక్రమాల్లో డబ్బున్న అమ్మాయిలను పడేసి పెండ్లి చేసుకోండి? లైఫ్ సెట్ చేసుకోండి? అని మల్లారెడ్డి చిల్లర మాటలు మాట్లాడినప్పుడే విద్యార్థి సంఘాలు తిరగబడాల్సింది. కాని అప్పుడు పెద్దగా పట్టించుకోలేదు. కాన్సర్ అనేది చిన్న గా మొదలైనప్పుడే వైద్యం చేయించుకోవాలి. శరీరం మీద పుండు పుడుతున్నప్పుడే చికిత్స చేసుకోవాలి. లేకుంటే ప్రాణాలు పోవచ్చు. శరీరంలో అవయవాలు తొలగించుకోవాల్సి రావొచ్చు. ఏ విద్యా సంస్థ అదినేతలైనా విద్యార్థులను కష్టపడి చదువుకోవాలని సూచించాలి. వాళ్లు చదువుకునే చదువులో అద్భుతాలు సృషించాలని చెప్పాలి. దేశానికి అవసరమైన పరిశోధనలు జరగాలని చెప్పాలి. తమ విద్యను,విజ్ఞానాన్ని దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవాలని చెప్పాలి. అంతే కాని చిల్లర మాటలు మాట్లాడి విద్యార్థులను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేసినప్పుడే క్రిమినల్‌కేసులు నమోదు చేయాల్సింది. కాని ప్రజాప్రతినిధి ముసుగులో వుండడం వల్ల చెల్లిపోయింది. ఇప్పుడే ఏకంగా కాలేజీ ప్రాంగణాన్ని వినోద కేంద్రంగా మార్చేశారు. సినిమా ఈవెంట్లకు వేదికలు చేశాడు. అది కూడా సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ జారీ చేసిన సినిమా ప్రమోషన్ ఈ వెంటును మల్లారెడ్డి యూనివర్సిటీ కాలేజీలో నిర్వహించారు. ఇది నేరం. ఒక సినిమాకు ఏ సర్టిఫికెట్ ఇచ్చారంటేనే అది అన్ని వయసుల వాళ్లు చూసే సినిమాకాదు. అందులో అశ్లీలం వుండొచ్చు. సమాజాన్ని చెడగొట్టే అంశాలు వుండొచ్చు. అసాంఘీక కార్యకలాపాలు చూపించి వుండొచ్చు. అలాంటి సినిమా ప్రమోషన్ చేయడానికి కనీసం సిగ్గుండాలి. నైతిక విలువలు లేని వాళ్ల చేతిలో విద్యా వ్యవస్థ బందీ అయితే ఇలాంటి దుర్మార్గాలే జరుగుతాయి. మల్లారెడ్డి కాలేజీలో ఇటీవల ఈవెంట్ జరిగిన సినిమా హీరో యాశ్ ఈ సినిమాను చిన్న పిల్లలు చూడొద్దు. 18 ఏళ్ల వయసులోపు పిల్లలకు టిక్కెట్లు ఇవ్వొద్దు. అని ప్రకటించారు. అలాంటి సినిమా ప్రమోషన్ ఈవెంట్ కాలేజీలో నిర్వహించానికి బుద్ది వుండొద్దా? మల్లారెడ్డికాలేజీలలో చదువుకునే వాళు ల్లో 18 ఏళ్ల వయసుకు తక్కువగా వున్న విద్యార్థులు లేరా? వాళ్లను కాలేజీకి తరలించడం నేరం కాదా? ఈవెంట్ నిర్వహణలో లోపాల మూలంగా విద్యార్థులకు గాయాలయ్యాయి. దానికి ఎవరు భాధ్యత వహిస్తారు. ఓ వైపు విద్యార్థులు ప్రమాదానికి గురైతే పొరపాటు జరిగింది? అని క్షమాపణ చెప్పాల్సిన మల్లారెడ్డి, ఆయన కోడలు ప్రీతి రెడ్డి విద్యార్థులపై రుసరుసలు ఆడడం విచిత్రం. మళ్లీ మన కాలేజీలో ఇలాంటి ఈవెంట్లు జరక్కండా చేశారని విద్యార్థులపై ఆగ్రహం వ్యక్తం చేయడం సైకోయిజానికి పరాకాష్ట కాదా? ఇప్పటి వరకు మల్లారెడ్డి కాలేజీలో జరిగిన ప్రమాదంలో ఎంత మంది విద్యార్దులకు గాయాలయ్యాయి? వాటి వివరాలు ఎందుకు పూర్తిగా వెల్లడించడం లేదు. అంత పెద్ద స్టాండ్ కుప్ప కూలి పోవడం వల్ల దానిపై వున్న విద్యార్దులే కాకుండా కింద వున్న వాళ్లకు ఎంత మందికి గాయాలయ్యాయి? ఇంత జరిగిన ప్రభుత్వం ఎందుకు మౌనంగా వుంది. మల్లారెడ్డి మీద చర్యలకు ఎందుకు ఆదేశాలు జారీ చేయడం లేదు. అసలు కాలేజీల్లో గతంలో ఎప్పుడూ సినిమా ఈవెంట్లకు పర్మిషన్లు ఇవ్వని పోలీసులు మల్లారెడ్డి కాలేజీకి ఎందుకిచ్చారు? ఆ ఈవెంట్ ఏమైనా మహాత్మాగాంధీ బయోగ్రఫీనా? బూతు సినిమా ఈవెంటుకు పోలీసు శాఖ ఎలా అనుమతులు ఇచ్చింది.



ప్రైవేటు యూనివర్సిటీలో సినిమా ఈవెంట్ నిర్వహించడమే యూజీసీ గౌడ్‌లైన్స్‌కు విరుద్దం. విద్యాహక్కు చట్టాన్ని కాలరాయడం కాదా? అసలు పోలీసు బందోబస్తు ఎలా కల్పించారు? విద్యార్దులకు గాయాలైన తర్వాత కూడా పోలీసులు మల్లారెడ్డి, ఆయన కోడలు ప్రీతిరెడ్డి మీద కేసులు ఎందుకు నమోదు చేయలేదు? ఇంత



జరిగినా విద్యార్ది సంఘాలు ఏం చేస్తున్నాయి? మానవ హక్కుల సంఘాలు ఎక్కడున్నాయి? హ్యూమన్ రైట్స్ కమీషన్ సుమోటోగా స్వీకరించలేదు. అన్నింటికన్నా ముఖ్యంగా ఉన్నత విద్యా మండలి ఏం చేస్తున్నట్లు? అనే ప్రశ్నలు అనేకం వున్నాయి. ఈవెంట్ల పేరుతో చిల్లర కార్యక్రమాలు నిర్వహించి విద్యార్దుల ప్రాణాల మీదకు తెచ్చిన మల్లారెడ్డిపై కేసులు నమోదు చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారు? విద్యార్థుల ప్రాణాలుపోయినా పరవాలే దనుకుంటున్నారా? ఇంత దుర్మార్గం చేసి కూడా విద్యార్థులను బెదిరించిన మల్లారెడ్డి, ఆయన కోడలుపై కేసులు నమోదు చేయకుండా ఎందుక తాత్సారం చేస్తున్నారు? ఇక కాలేజీలో ఈవెంట్లు జరకుండా విద్యార్థుల ప్రవర్తన వుందని ఆగ్రహం వ్యక్తంచేయడం అన్యాయం కాదా? అసలు కాలేజీలు వున్నవి విద్యనందించేందుకా? లేక ఈవెంట్ల నిర్వహణ కోసమా? అనేది కూడా తెలాల్సి వుంది. ఒక సినిమాకు ఏ సర్టిఫికెట్ ఎందుకు ఇస్తారో మల్లారెడ్డికి తెలియందా? నిజంగా మల్లారెడ్డికి సినిమా పిచ్చి వుందన్న సంగతి అందరికీ తెలిసిందే. స్వయంగా ఆయనే చెప్పిందే. తన బయోగ్రఫీ మీదసినిమా తీస్తానని కూడా ప్రకటించుకున్నారు. తనను హరీష్‌శంకర్ లాంటి దర్శకులు విలన్ వేషాలు వేయాలని కోరారని కూడా మల్లారెడ్డి వీలు చిక్కినప్పుడల్లా చెబుతూ వచ్చారు. నిజంగా మల్లారెడ్డికి సినిమా పిచ్చి వుంటే కాలేజీలు మూసుకొని ఈవెంట్ల వ్యాపారం చేసుకోవచ్చు? ఎవరూ వద్దనరు. ఒక ఈవెంట్‌కు అవసరమైనంత మంది తన కాలేజీలో వున్నారని విద్యార్థులను సినిమా ఈవెంట్లకు తీసుకురావడం నేరం. తనకు సినిమా పిచ్చి వుంటే ముఖానికి రంగేసుకొని సినిమాలు చేసుకోవచ్చు? ఎవరూ అభ్యంతరం పెట్టరు. కాని మల్లారెడ్డికి వున్న సినిమా పిచ్చి విద్యార్థుల మీద రుద్ది వారి జీవితాలను ఆగం చేసే హక్కు ఆయనకు లేదు. పవిత్రమైన విద్యాలయాలను నడుపుతూ వెలికి సినిమాలకు తన కాలేజీని ప్రమోషన్ల కోసం వాడుకోవడం అనేది క్షమించరానిది. మల్లారెడ్డికి వున్న సినిమా షోకు మూలంగా విద్యార్థుల మెదడు కలుషితం చేయడం సరైంది కాదు. కాలేజీ వార్షికోత్స సభల్లో కుప్పిగంతలు వేయడం, దిక్కు మాలిన మాటలు మాట్లాడడం మల్లారెడ్డికి అలవాటే. కాని తన పచ్చిని ఇతరుల మీద రుద్దడం అంటే ఆ వ్యవస్థకు పట్టిన చీడ పురుగు మల్లారెడ్డి అని చెప్పక తప్పదు. నోరు తెరిస్తే అబద్దాలు చెప్పి పూటగడుపుకునే వ్యక్తి మల్లారెడ్డి. రాజకీయాల్లోకి వచ్చిన నాటినుంచి ఆయన చెబుతున్న అబద్దాలు అన్నీ ఇన్నీకావు. ఇలాంటివారు అవకాశ వాదులు. తన స్వార్థం కోసం ఎవరైనా ముంచేస్తారు? మల్లారెడ్డి మాటలు నిజమని నమ్మి బిఆర్‌ఎస్ పార్టీ చేర్చుకున్నది. ఆయనకు ప్రజల్లో పలుకుబడి వుందని నమ్మి ఆయనకు పదవులు ఇస్తూ పోయింది? మల్లారెడ్డి చెప్పే అబద్దాలు కూడా బిఆర్‌ఎస్‌పార్టీ మెడకు చుట్టుకుంటాయన్నది ఇప్పటికైనా బిఆర్‌ఎస్ గ్రహించాలి. తన రాజకీయ భవిష్యత్తు కోసం ఉద్యమ కారుడైన మలిపెద్ది సుదీర్‌రెడ్డి రాజకీయాన్ని తుంచేశారు. ఆయనపై రకరకాలు అసత్య ప్రచారాలు చేసి, రాజకీయంగా భవిష్యత్తు లేకుండా చేశారు. అలాంటి మల్లారెడ్డిని నమ్మితే, ఇప్పుడు గోడ దూకేందుకు ఆ మధ్య సిద్దమయ్యాడని ప్రచారం జరిగింది. ఆ సమయంలో బిజేపి దేశంలో తిరుగులేని శక్తిగా వుందని నమ్మి అటు దూకబోయాడు. బిఆర్‌ఎస్‌కు ద్రోహం చేయబోయాడు. ఒక్కసారి జెన్‌జీ ఉద్యమం మొదలు కాకాగానే బిజేపివైపు వేయాలనుకున్న అడుగులు వెనక్కి తీసుకున్నాడు. ఇప్పుడు బిఆర్‌ఎస్‌లోనే వున్నానని సన్నాయినొక్కులు నొక్కుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు విద్యా రంగానికే మచ్చ. బిఆర్‌ఎస్ పార్టీకే కాదు, రాజకీయాలకే ఒక మాయని మచ్చ???

TQRCG

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999